ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 20 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:19 (గురువారం సాయంత్రం)

సహర్: 4:46 (శుక్రవారం ఉదయం)

గంజాయి కేసులో మైనర్ సహా ఐదుగురి అరెస్ట్

11 కిలోలు స్వాధీనం

నిడదవోలులో ఘటన

గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా : సీఐ

7

అంతరిక్షం.. అద్భుతం!



భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమిపై అడుగిడిన వేళ అమలాపురం రూరల్‌లోని సమనస లోని శ్రీరామా పబ్లిక్ స్కూలు విద్యార్థులు 'వెల్‌కం సునీత' అనే అక్షరాల రూపంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపిన దృశ్యం.

\- అమలాపురం రూరల్




కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు అంజి ఆకొండి వాటర్ కలర్స్‌తో గీసిన సునీతా విలియమ్స్ చిత్రం.

7

ఆలివ్ రిడ్లే.. గుడ్లు.. గుడ్లే..





- సముద్ర తీరంలో విదేశాల నుంచి అలీవర్ రిడ్లే తాబేళ్ల ప్రవాహం
- ఇప్పటివరకు కాకినాడ, కోనసీమ జిల్లాలకు 675 తాబేళ్లు రాక
- జనవరి 18 నుంచి ఈ రెండు జిల్లాల్లో 74 వేల గుడ్లు పెట్టిన తాబేళ్లు
- కాకినాడ హోప్‌ఐలాండ్‌లో 27 వేల గుడ్లు పెట్టిన 225 తాబేళ్లు
- కోనసీమ జిల్లాలో 46 వేల గుడ్లు పొదిగిన 450 అలీవ్‌రిడ్లేలు
- ఒక్కో తాబేలు 120 చొప్పున గుడ్లు పొదుగుతున్న వైనం
- సముద్ర తీరాన గొయ్యి తీసి గుడ్లు పొదిగి ఇసుక కప్పేసి తిరిగి సముద్రంలోకి
- మొదలైన గుడ్ల నుంచి తాబేలు పిల్లల జననం.. రోజుకు 650 పిల్లలు బయటకు
- నక్కలు, కుక్కల బారి నుంచి రక్షించేందుకు అటవీ శాఖ హేచరీలు
- గతేడాది ఉమ్మడి జిల్లాలో 1.20 లక్షల గుడ్లు పొదిగిన అలీవ్‌రిడ్లే తాబేళ్లు



గుంతలు తవ్వి గుడ్లు పొదిగిన తాబేళ్లు


(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

అంతరించేపోయే జాబితాలో చేరిన అరుదైన అలీవ్‌రిడ్లే తాబేళ్లు మన సముద్ర తీర ప్రాంతానికి ఓ ప్రవాహంలా తరలివస్తున్నాయి. ఎక్కడెక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీలంక.. థాయ్‌లాండ్.. ఇండోనేషియా దేశాల నుంచి సముద్రంలో వేల కిలోమీటర్లు ఈదుకుంటూ ఇక్కడకు సంతానోత్పత్తి కోసం బారులు తీరుతున్నాయి.. ఇప్పుడు కాకినాడ జిల్లాలోని హోప్ ఐలాండ్.. కోనసీమ జిల్లాలోని గోదావరి, సముద్రం కలిసే ప్రాంతాల్లో వేలల్లో గుడ్లు పెడుతున్నాయి. సంతానోత్పత్తికోసం అంతదూరం నుంచి వస్తోన్న ఈ తాబేళ్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఇప్పటివరకు పెట్టిన గుడ్లు ఎన్నో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే.. ఒక్కో తాబేలు సరాసరి 120 గుడ్ల చొప్పున జనవరి మూడో వారం నుంచి ఇప్పటివరకు ఏకంగా 74 వేల గుడ్లు పొదిగాయి. గుడ్లు పొదిగేసి ఆ వెంటనే తిరిగి సముద్రంలోకి వెళ్లిపోగా.. ఇప్పుడు ఆ గుడ్ల నుంచి రిడ్లే పిల్లలు బయటకు రావడం మొదలుపెట్టాయి. ఎక్కడో వేల కిలోమీటర్లు ఈదుకుని ఇక్కడ కొచ్చి గుడ్లు పొదిగి పిల్లలను చూడకుండానే వెళ్లిపోతున్న తాబేళ్ల ఆ గుడ్లను రక్షించేందుకు ఏకంగా గోతులు తవ్వి అందులో గుడ్ల పొదిగి ఎవరికి కనిపించకుండా ఇసుక కప్పేసి వెళ్లిపోగా.. ఇప్పుడు వాటి నుంచి రోజుకు వందలాది పిల్లలు బయటకు వస్తున్నాయి. దీంతో ఇప్పుడు సముద్రతీరంలో ఇవన్నీ సందడి చేస్తూ కనువిందు చేస్తున్నాయి. అటు అటవీ శాఖ అధికారులు ఈ గుడ్ల నుంచి క్షేమంగా పిల్లలు బయటకు వచ్చేలా అనేక రక్షణ చర్యలు తీసుకుంటుండడంతో ఈ ఏడాది ఆలివ్‌రెడ్లే తాబేళ్ల సంతానం భారీస్థాయిలో పెరుగుతోంది.

సందడే సందడి..

సముద్ర పర్యావరణాన్ని రక్షించడంలో ఎంతో కీలకమైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోయే జాబితాలో ఉన్నాయి. ఈ తాబేళ్లలో ఏడు రకాల జాతులుండగా, ఐదు జాతులు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో అధికం. అటు శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేషియా దేశాల్లోను అనేక జాతులున్నాయి. ఇప్పుడివి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సముద్ర తీరానికి వందల్లో ప్రయాణించుకుంటూ వస్తున్నాయి. ప్రధానంగా కాకినాడ హోప్‌ఐలాండ్, కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, అల్లవరం, అమలాపురం రూరల్ ప్రాంతాల్లోని సముద్ర తీరానికి తరలివస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా వీటి సందడే నెలకొంది. వీటి రాక జనవరి నెలాఖరు నుంచి మొదలవగా ప్రస్తుతం ఎక్కువ సంఖ్యకు చేరుకుంది. ఇలా వచ్చిన తాబేళ్లన్నీ కాకినాడ, కోనసీమ జిల్లాల్లో భారీగా గుడ్లు పొదుగుతున్నాయి. ఇప్పటివరకు అటవీశాఖ అధికారుల అంచనా మేరకు కాకినాడ జిల్లాకు 225, కోనసీమ జిల్లాకు 450 తాబేళ్లు వచ్చినట్టు గుర్తించారు. ఇవి ఇప్పటివరకు మొత్తం 74 వేల గుడ్లు పొదిగాయి. ఇది భారీ సంఖ్యగానే భావించాలి. కాకినాడ జిల్లాలో హోప్‌ఐలాండ్‌కు ఇప్పటివరకు 225 తాబేళ్లు రాగా, 28వేల గుడ్లు పొదిగాయి. కోనసీమ జిల్లాలో 450 తాబేళ్లు 46వేల గుడ్లు పొదిగినట్టు గుర్తించారు. దీంతో ఈ రెండు జిల్లాల తీర ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సందడి భారీగా ఉంది. వాస్తవానికి ఈ గుడ్లను తాబేళ్లు సముద్రతీరాన ఇసుకలో 30 నుంచి 45 సెంటీమీటర్ల లోతున కుండాకారంలో గుంతలు తీస్తాయి. వాటిలో గుడ్లను పొదుగుతాయి. ఒక్కో తాబేలు సరాసరి 120 వరకు గుడ్లను పొదుగుతాయి. ఆ వెంటనే గుడ్లపై ఇసుకను కప్పేసి తిరిగి తాబేళ్లు తమ గమ్యస్థానానికి వెళ్లిపోతాయి. ఆ తర్వాత 40 రోజుల ఆ తర్వాత ఆ గుడ్ల నుంచి తాబేళ్లు పొదుగుతాయి. ఈలోపు 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఎండ వేడిమి ఉంటేనే గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. ఇప్పుడు హోప్‌ఐలాండ్‌తోపాటు కోనసీమ జిల్లాలో వాసాలతిప్ప, ఎస్.యానాం, గచ్చకాయల పొర, నీళ్ల రేవు తదితర ప్రాంతాల్లో వేలల్లో ఉన్న గుడ్లను అటవీశాఖ సంరక్షిస్తోంది. తాబేళ్లు పెట్టే గుంతలను ఇన్సిటివ్‌గా పిలిచే అటవీశాఖ వాటి చుట్టూ ప్రస్తుతం నెట్‌లు కట్టి రక్షిస్తోంది. లేదంటే కుక్కలు, నక్కలు ఈ గుడ్లను తినేసే ప్రమాదం ఉంది. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న గుడ్లను అటవీశాఖ కాకినాడ జిల్లాలో రెండు, కోనసీమ జిల్లాలో ఐదుచోట్ల హేచరీల కింద ఒకేచోటకు తెచ్చి సంరక్షించడంతో దీంతో ఈ దఫా గుడ్ల సంరక్షణ మెరుగైంది.





గుడ్లను సంరక్షిస్తోన్న అటవీశాఖ సిబ్బంది

పిల్లలు బయటకొస్తున్నాయి..

ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో కాకినాడ, కోనసీమ జిల్లాలకు 675 వరకు రాగా, 90 శాతం తాబేళ్లు గుడ్లు పెట్టి వెళ్లిపోయాయి. ఇప్పుడు 40 రోజుల వ్యవధి దాటడంతో ఆదివారం నుంచి పిల్లలు పొదుగుతున్నాయి. రోజుకు ఉమ్మడి జిల్లాలో 780 వరకు పిల్లలు బయటకొస్తున్నాయి. ఇవి పుట్టిన 12గంటల్లో తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతున్నాయి. వాస్తవానికి అరుదైన జాతికి చెందిన ఆలివ్‌రిడ్లే తాబేళ్లలో ఆడా, మగా పుట్టుక పూర్తిగా ఉష్ణోగ్రతపైనే ఆధారపడనున్నాయి. గుడ్లు పొదిగిన తర్వాత 28 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే 40 రోజుల తర్వాత మగ తాబేళ్లు, ఉష్ణోగ్రత 30 నుంచి 32 మధ్య ఉంటే ఆడ తాబేళ్లు బయటకు వస్తాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఆడతాబేళ్ల పిల్లలు అధికంగా బయటకు వస్తున్నాయి. కాకినాడతో పోల్చితే కోనసీమ జిల్లాలో పిల్లలు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఈనెలాఖరు వరకు రానున్న తాబేళ్లు మరికొన్ని గుడ్లను పొదగనున్నాయి. ఈనెల దాటితే విదేశాల నుంచి ఆలివ్ రిడ్లే తాబేళ్ల రాక పూర్తిగా ఆగిపోనుంది.

ఇక్కడకే ఎందుకంటే..

ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ఓ ప్రత్యేకత ఉంది. అవి ఎక్కడైతే గుడ్ల నుంచి పిల్లలుగా బయటకు వచ్చాయో అదే ప్రాంతానికి పెద్దయ్యాక తిరిగి సంతానోత్పత్తికి వస్తాయి. ఇందులోభాగంగా కాకినాడ జిల్లాలో హోప్ ఐలాండ్, కోనసీమ జిల్లాలో కొన్ని తీరప్రాంత మండలాలకు తరలివస్తున్నాయి. గతంలో ఉప్పాడ తీరానికి సైతం భారీగా వచ్చేవి. అక్కడ సముద్రతీరం కలుషితం కావడంతో ఇక్కడకు రావడం లేదు. వాస్తవానికి ఏటా వేలల్లో వచ్చే ఆలివ్‌రిడ్లే తాబేళ్లు కొన్నేళ్లుగా భారీగా తగ్గిపోయాయి. సముద్ర కాలుష్యం, వేట పడవలకు తగిలి, వలలో చిక్కుకుని భారీగా చనిపోతున్నాయి. దీంతో రెండేళ్లుగా సముద్రతీరంలో ఎక్కడ చూసినా వీటి కళేబరాలే కనిపిస్తున్నాయి. దీంతో అరుదైన జాతికి చెందిన వీటిని సంరక్షించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జిల్లా అటవీశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో తాబేళ్ల గుడ్లను ఇటీవల ఎక్కువగా సంరక్షిస్తున్నారు. సముద్రంలో ఆక్సిజన్ శాతం పెంచేందుకు, చేపల సంతానం వృద్ధి చెందేందుకు ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఎంతగానో దోహదం చేస్తాయి. చేప పిల్లలను తిని జీవించే జెల్లీఫిష్‌లను తాబేళ్లు తినడంవల్ల చేపల ఉత్పత్తి పెరుగుతుంది. కాగా గతేడాది ఉమ్మడి జిల్లాలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు లక్షకుపైగానే గుడ్లు పొదిగాయి. కాకినాడ జిల్లాకు గతేడాది 420 తాబేళ్లు రాగా 32 వేల వరకు గుడ్లు పొదిగాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గతేడాది 850 వరకు తాబేళ్లు రాగా 91 వేల గుడ్లు పొదిగాయి.

12 పంచాయతీలకు ఉపసర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని 10 మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న ఉపసర్పంచ్‌ల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడిందని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతామణి తెలిపారు. దీనిలో భాగంగా గోకవరం మండలం పరిధిలో మల్లవరం, కొవ్వూరు మండలంలో పీనకలమెట్ట, రాజానగరం మండలంలో పాతతుంగపాడు, గోపాలపురం మండలం పరిధిలో కొవూరుపాడు, గోపాలపురం, వెంకటాయిపాలెం, తాళ్లపూడి మండలం తాడిపూడి, అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం, రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ, సీతానగరం మండలం మునికూడలి, ఉండ్రాజవరం మండలం ఉండ్రాజవరంతో కలసి మొత్తం 12 గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఈనెల 27న ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు ఆమె తెలియజేశారు.

ఎంపీపీ, ఎంపీపీ ఉపాధ్యక్ష ఖాళీల భర్తీకి 27న ఎన్నికలు

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానాలకు, ఎంపీపీ ఉపాధ్యక్ష పదవులకు, కోఆప్షన్ మెంబర్ల ఉపఎన్నికలకు షెడ్యూలు విడుదల చేశారు. కాకినాడ రూరల్, బిక్కవోలు, కాట్రేనికోన మండలాల ఎంపీపీ పదవులకు ఎన్నిక జరగనుంది. అలాగే సఖినేటిపల్లిలో రెండు వైస్ ఎంపీపీలకు ఎన్నిక జరుగుతుంది. పెరవలి, రంగంపేట మండల పరిషత్‌లలో కోఆప్షన్ మెంబరు పదవులకు ఎన్నిక జరుగుతుంది. ఈనెల 27వ తేదీన ఈ ఎన్నికలకు సంబంధించి ఉదయం పది గంటలలోగా నామినేషన్లు స్వీకరణ జరుగుతుంది. ఉదయం 10 గంటల తర్వాత నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 12 గంటలకు ఆమోదించబడిన అభ్యర్థుల నామినేషన్ల వివరాలు ఇవ్వడం జరుగుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపు నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుంది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఆయా పదవులకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ సాగుతుంది. వెంటనే ఎన్నికైన అభ్యర్థుల వివరాలు వెల్లడించడం జరుగుతుంది.

బాకీ వసూల్!

- పేరుకుపోయిన చలానాలు
- ట్రాఫిక్, రవాణా కలిపి రూ.13 కోట్ల పెండింగ్
- వాటిని రాబట్టడంపై ప్రత్యేక డ్రైవ్‌లు
- పట్టుబట్టి మరీ అక్కడికక్కడే వసూలు



ఆటోలు తనిఖీలు చేస్తున్న మహిళా పోలీసులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రహదారి నిబంధనల ఉల్లంఘనలపై విధించిన జరిమానాలు భారీగా పేరుకుపోయాయి. ట్రాఫిక్ పోలీసులు, రవాణా అధికారులు వాటి వసూళ్లపై తీవ్రంగా దృష్టిసారించారు. మరోవైపు పాత బాకీలకు కొత్త ఉల్లంఘనలు తోడవుతూనే ఉన్నాయి. ఈనెల 1 నుంచి సవరించిన జరిమానాలు అమల్లోకి రావాల్సి ఉంది. అయితే సాంకేతిక కారణాల వల్ల సమస్య రావడంతో ఇంకా కొత్త చలానాలు విధించడం లేదు. పెండింగ్ చలానాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోనే ఎక్కువగా చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడే ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో చలానాల పెండింగ్ కూడా అదే స్థాయిలో ఉంది. హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, రెడ్ సిగ్నల్ పడినా ఆగకపోవడం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం, మితిమీరిన వేగం వంటి ఉల్లంఘనలపై విధించిన చలానాలు ఆయా వాహనాదులు చెల్లించకపోవడంతో పెద్ద మొత్తంలో పెండింగ్ చూపెడుతోంది. గతంలో మితిమీరిన వేగంతో వెళ్లినా, హెల్మెట్ లేకపోయినా తదితర ఉల్లంఘనలకు అక్కడికక్కడే జరిమానా విధించడం జరిగేది. అయితే తర్వాత కెమెరాలను రంగంలోకి దింపారు. ఏదైనా రహదారి భద్రతా నియమాలను పాటించకపోతే వెంటనే ఫొటో తీసి వెబ్‌సైటులో



దేవీచౌక్‌లో వాహనాల తనిఖీలు

అప్‌లోడ్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వాహనదారులు పరివాహన్ వెబ్‌సైటులో చెక్ చేసుకొని చలానా చెల్లించేసి ఆ కాపీ ప్రింట్ తీసి లేదా స్క్రీన్‌షాట్ తీసి దగ్గర పెట్టుకుంటే ఇబ్బంది ఉండదు. అయితే వాహనానికి చలానా విధించారనే విషయం వాహనదారుడికి తెలియడం లేదు. కనీసం సెల్‌ఫోన్‌కి మెసేజ్ వెళ్లే సిస్టం కూడా లేదు. దీంతో చలానాల పెండింగ్ ఎక్కువవుతోంది. సాధారణంగా ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు మూడు నెలలకు ఒకసారి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి వాటికి పెద్దగా పెండింగ్ ఉండదు. రవాణేతర అంటే ద్విచక్ర వాహనాలు, సొంత నెంబరు ప్లేటు కలిగిన కార్లు వంటి వాటిపై ఎక్కువగా చలానాలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలపై భారీగా బాకీలు ఉన్నాయి. సాధారణంగా వాహనదారులు https://echallan.parivahan.gov.in వెబ్‌సైటులోకి వెళ్లి సదరు వాహనంపై ఏదైనా చలానా పెండింగ్ ఉందా లేదా అనేది చెక్ చేసుకోవచ్చు. చలానా పెండింగ్‌లో ఉంటే తెలుస్తుంది. ఆ సొమ్మును ఆన్‌లైన్ ద్వారా అదే వెబ్‌సైటు నుంచి చెల్లించవచ్చు. మీసేవలో కట్టవచ్చు. పెండింగ్ చలానాలను రాబట్టడానికి ఇప్పుడు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో వాహనంపై చలానా పెండింగ్ ఉన్నట్టు తనిఖీ అధికారులు గుర్తిస్తే వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. లేదంటే వాహనం సీజ్ చేసే అధికారం అధికారులకు ఉంటుంది.

• జిల్లాలో రూ.13 కోట్లపైనే

జిల్లాలో జరిమానాలు భారీగా పెండింగ్ ఉన్నాయి. కోర్టు జరిమానా విధిస్తే వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. పెండింగ్ చలానాలకు ఏరోజుకారోజు జరిపే తనిఖీల్లో విధంచే చలానాలు జత చేరుతున్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం ట్రాఫిక్ పోలీసులకు సంబంధించి గత ఏడాదివి రూ.3 కోట్ల విలువ చేసే 75 వేల చలానాలు, 2025లో ఇప్పటివరకూ రూ.80 లక్షలు విలువచేసే 20 వేల చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. రవాణా శాఖకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5కోట్లు జరిమానాలు వసూలు కాగా.. ఇంకా 5 వేల కేసులకు రూ.10 కోట్లు వసూలు కావాల్సి ఉంది.



మహిళా శక్తి టీమ్‌లకు పచ్చజెండా ఊపుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

మహిళా శక్తి యాప్ ప్రతి మహిళ సెల్‌ఫోన్‌లో ఉండాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నూతనంగా అధునాతన సాంకేతికతతో ప్రభుత్వం తీసుకొచ్చిన 'మహిళా శక్తి' యాప్ బాలికలు, మహిళల పట్ల రక్షణ కవచం వంటిదని.. అందువల్ల ఆ యాప్ వారి సెల్‌ఫోన్స్‌లో కచ్చితంగా ఉండాల్సిందేనని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఏడు శక్తి బృందాల వాహనాలకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పచ్చజెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. అంతకుముందు ఎస్పీ మాట్లాడుతూ దిశ యాప్‌లో రిజిస్ట్రేషను చేసుకున్న వాళ్లు కూడా ఇప్పుడు మరిన్ని సదుపాయాలతో వచ్చిన మహిళా శక్తి యాప్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషను చేసుకోవాలన్నారు. ఈ యాప్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. 24/7 మహిళల భద్రతే ధ్యేయంగా మహిళా శక్తి టీమ్స్ పనిచేస్తాయన్నారు. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలలు, పార్కులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్లలో మఫ్టీలో శక్తి టీమ్ సభ్యులు గమనిస్తూ ఉంటారన్నారు. మహిళలు, బాలికలు ఆపదలో ఉన్న సమయంలో సాధ్యమైనంత తక్కువ సమయంలో వారి వద్దకు చేరుకుంటారని వివరించారు. మహిళలను సురక్షితంగా చూసుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. రాత్రి 10.30గంటల తర్వాత బాలికలు తారసపడితే వారిని సున్నితంగా ప్రశ్నించి ఇబ్బందికర పరిస్థితి అనుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు/వేధింపులపై ఎలాంటి సమాచారం ఉన్నా తమతో పంచుకోవాలని కోరారు. ఇప్పటికే రెండు మండలాల్లో మహిళలు/బాలికల పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశామని, మరిన్ని ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే గంజాయి వంటి నిషేధిక మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా నేరుగా తనకు తెలియజేయవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మత్తు కలిగించే ఔషధాలను డాక్టరు ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించడం నేరమని, వాటి అమ్మకాలపై నిఘా పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ(అడ్మిన్), ఏవీ సుబ్బరాజు(శాంతి భద్రతలు), ఎల్.అర్జున్(క్రైమ్స్), ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న వికాస ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో జీఎస్ఎల్ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్, హాస్టల్ మేనేజరు, ల్యాబ్ టెక్నీషియన్, ఎంసీవీ మాటో కార్ప్‌లో జీఎం, మేనేజరు, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, మహిళలకు ప్రత్యేకంగా ఫాక్స్‌కాన్, హైదరాబాదులో ఆపరేటర్, ఇండో ఎంఐఎం, పానా సొనిక్, హ్యుండాయ్ కంపెనీలలో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, నర్సింగ్, బీటెక్ ఉత్తీర్ణులై ఉండి 30 ఏళ్ల లోపు వయస్సు గలవారై ఉండాలన్నారు. అర్హతను బట్టి 10 వేల నుంచి 40వేల వరకు జీతం, అలవెన్సులు ఆయా ఉద్యోగాలకు అనుగుణంగా ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉదయం 9.30 గంటలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, జిరాక్సు కాపీలతో నేరుగా హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 7660823903 నంబరుకు ఫోన్ ద్వారా సంప్రదించాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

అంతరిక్షం.. అద్భుతం!



అంతరిక్షం గురించి తెలుసుకోవాలని ఎంతో మందికి ఆసక్తి ఉంటుంది. అంతుచిక్కని, అద్భుతమైన విషయాలపై దృష్టిపెట్టి బుర్రకు పదును పెట్టాలని అనుకుంటూ ఉంటారు. అయితే భారతదేశ సంతతికి చెందిన సునీతా విలియమ్స్ అంతరిక్షానికి వెళ్లి తిరిగి వస్తున్నారని తెలిసి ఎంతోమంది సంబరపడ్డారు. బుధవారం తెల్లవారుజామున ఆమె భూమిమీదకి వచ్చే క్షణాలను ఆస్వాదించడానికి ఉదయానే నిద్రలేచి టీవీలకు అతుక్కుపోయారు. ఆమె విజయమే తమ విజయంగా మురిసిపోయారు.

భూమి మీదకు సునీతా విలియమ్స్ రాకతో ప్రజల్లో ఆనందం

సర్వత్రా ప్రశంసలు

2028లో ఇస్రో ఆధ్వర్యంలో..
భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్మాణం

యాళ్ల శివప్రసాద్, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త



శివప్రసాద్

అమలాపురం రూరల్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. భూమికి వంద కిలో మీటర్ల పైవరకు వాతావరణం ఉంటుంది. ఇక ఆ పైన అంతా అంతరిక్షమే. అక్కడ ఆక్సిజన్ అనేది ఉండదని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మానవాళి జీవించేందుకు ఉపయోగపడేలా అనువైన ప్రాంతాలను గుర్తించడానికి అంతరిక్ష పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా మైక్రో గ్రావిటీ మీద అంతరిక్షంలో ప్రయోగాలు చేస్తున్నారు. అంతరిక్ష పరిశోధనలపై ఎంతో ఆసక్తి ఉన్నా సునీతా విలియమ్స్ 8 రోజులు ప్రయోగాలు చేయడానికి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో 9నెలల తర్వాత క్షేమంగా భూమికి తిరిగి రావడం విశేషం. ముందుగా వెళ్లిన ఐదుగురు వ్యోమగాములతోపాటు సునీతా విలియమ్స్ మరో వ్యక్తి అక్కడే ఉన్నారు. వారికి అవసరమైన ఆహార పదార్థాలను కార్గో స్పేస్ ద్వారా పంపిస్తారు. అంతరిక్షంలో ఉన్నవారికి స్పేస్ మెడిసన్స్ పేరిట ప్రత్యేకంగా మందులు ఉంటాయి. వారు అక్కడే ఉంటూ అంతరిక్షంతోపాటు ఇతర గ్రహాల మీద మనుషులు జీవించేందుకు వీలున్న ప్రాంతాలను గుర్తించడంతోపాటు అక్కడ లభించే ప్రకృతి సంపదలను గుర్తించేందుకు నిరంతరం ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. అమెరికా, రష్యా, జపాన్, యూరోపియన్ దేశాలతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష సంస్థను అంతరిక్షంలో కట్టారన్నారు. అక్కడ నిర్మించిన స్పేస్ సెంటర్ అమెరికాలోని ఫుట్‌బాల్ క్రీడా ప్రాంగణమంత ఉంటుందని వివరించారు. భూమికి 400 కిలోమీటర్ల దూరంలో ఆ దేశాలు ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌ను నిర్మించాయన్నారు. స్పేస్ స్టేషన్ నిరంతరం భూమి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. గంటకు 28వేల కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతుందని వివరించారు. ఒకసారి భూమి చుట్టూ స్పేస్ స్టేషన్ తిరిగి రావడానికి 90 నుంచి 92 నిమిషాల సమయం పడుతుందన్నారు అంత వేగంగా తిరిగితేనే స్పేస్ స్టేషన్ అంతరిక్షంలో ఉండగలుతుందని లేకపోతే పడిపోతుందన్నారు. అంతరిక్ష సంస్థ తరహాలోనే భారతదేశం ఇస్రో ఆధ్వర్యంలో స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే సన్నాహాలు చేపట్టిందన్నారు. 2028 నాటికి స్పేస్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. స్పేస్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా డాకింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేసుకున్న దేశాల్లో నాల్గో స్థానాన్ని భారతదేశం దక్కించుకుందన్నారు. డాకింగ్ టెక్నాలజీలో భాగంగా పీఎస్ఎల్వీసీ60 రాకెట్‌లో రెండు ఉపగ్రహాలను ఉంచి గతేడాది డిసెంబరు 30న అంతరిక్షంలో వదిలారన్నారు. ఉపగ్రహాల మధ్య దూరం 20 కిలోమీటర్లు ఉంటుందని, అవి ఒకదానికొకటి దగ్గరకు వచ్చి అనుసంధానం చేయడమే డాకింగ్ టెక్నాలజీ విశిష్టత అన్నారు. డాకింగ్ టెక్నాలజీ ఉంటేనే స్పేస్ స్టేషన్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. భారతీయ వ్యోమగాములు త్వరలోనే అంతరిక్ష ప్రయోగాలకు ఇస్రో ఆధ్వర్యంలో బయలుదేరడం ఖాయమని శివప్రసాద్ స్పష్టం చేశారు.



సునీతా విలియమ్స్

సునీతా విలియమ్స్ అందరికీ స్ఫూర్తి : మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమిపై రావడం సంతోషకరమని, ఆమె నేటి యువతకు స్ఫూర్తి అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ 59 ఏళ్ల వయస్సులో అంతరిక్ష పరిశోధనకు వెళ్లి సాంకేతిక లోపం కారణంగా 9 నెలలు అక్కడే ఉండాల్సిరావడంతో ఏమాత్రం మానసిక స్థైర్యం కోల్పోకుండా తిరిగి భూమికి క్షేమంగా చేరుకోవడం సామాన్య విషయం కాదన్నారు. సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్‌విల్మోర్‌ను భూమిమీదకు తీసుకురావడానికి కృషి చేసిన అందరూ అభినందనీయులన్నారు.

మహిళలకు ఆదర్శం సునీతా విలియమ్స్



దివాన్‌చెరువు(ఆంధ్రజ్యోతి): రోదసి నుంచి భూమికి తిరిగి వచ్చిన సునీతా విలియమ్స్ నేటి మహిళలకు ఆదర్శం. ప్రతికూల పరిస్థితులను ఏవిధంగా జయించాలో తెలిపిన నింగి నుంచి నేలమీదకు వచ్చిన నిలువెత్తు రూపం. అంతరిక్ష యాత్రికురాలు సునీత, వ్యోమగామి బుచ్‌విల్మోర్ సహా నలుగురు 9నెలలపాటు అంతరిక్షంలో గడిపి భూమికి చేరుకోవడం హర్షణీయం. అంతరిక్ష పరిశోధనలో మరో చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది. ఎన్నిప్రతికూల పరిస్థితులు ఎదురైనా అధిగమించే స్ఫూర్తిని సునీతా విలియమ్స్ జీవితం నుంచి నేర్చుకోవాలి.

ఆచార్య ప్రసన్నశ్రీ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి

సునీతా విలియమ్స్ రోల్‌మోడల్



రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో జీరో గ్రావిటీ వాతావరణంలో జరిపే ప్రయోగాలకు వ్యోమగామి సునీతా విలియమ్స్ ప్రపంచ దేశాల అంతరిక్ష శాస్త్రవేత్తలకు రోల్‌మోడల్ కానున్నారు. ఆమె రాబోయే తరాలకు మార్గదర్శకం. 322 రోజుల 17 గంటలకు పైగా అంతరిక్షంలో గడిపి చరిత్ర సృష్టించడంతోపాటు రికార్డు బ్రేకింగ్ స్పేస్‌వాకింగ్ చేశారు. అంతరిక్షంలో దాదాపు 50 గంటల 40 నిమిషాలు స్పేస్‌వాక్ చేయడం ద్వారా అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. ఆమె ఎన్నో అంశాలను స్టడీ చేశారని భావిస్తున్నా, ఇవన్నీ భావి అంతరిక్ష పరిశోధకులకు ఎంతో ఉపయోగపడతాయి.

రామచంద్ర ఆర్‌కే, భౌతికశాస్త్ర పరిశోధకుడు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, రాజమహేంద్రవరం

సునీతా విలియమ్స్ రాక ఎంతో ఆనందం



కోటనందూరు (ఆంధ్రజ్యోతి): సునీతా విలియమ్స్ భూమి మీదకి విజయవంతంగా తిరిగి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఆమె 286 రోజులు అంతరిక్షంలో గడిపి అనేక పరిశోధనలు చేసి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్స్ ద్వారా క్షేమంగా భూమికి చేరుకోవడం గొప్ప విషయమే. ఇది శాస్త్రసాంకేతిక రంగాల్లో మనిషి చేసిన ప్రగతికి అద్భుతమైన నిదర్శనం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఉంది. సునీతా విలియమ్స్ వంటి శాస్త్రవేత్తలు మనదేశానికి ఉండడం గర్వకారణం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు ఇలాంటి వ్యక్తులు మనకు ఆదర్శంగా ఉండాలి. భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుంది.

-ఎం.రామ్‌శేఖర్, ఎం‌ఈవో2, ఫిజిక్స్ టీచర్, కోటనందూరు

తమిళనాడు తరహాలో..

ద్వారపూడిలో కావిళ్ల ఉత్సవం

కలశాలతో 500 మంది మహిళల ఊరేగింపు





నెత్తిపై కలశంతో యువతి, స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తున్న స్వాములు

మండపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో బుధవారం కుమారస్వామివారి కావిళ్ల, కలశ ఉత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. తమిళనాడు తరహాలో ఇక్కడ ప్రతి ఏటా ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. దాదాపు 40 రోజులపాటు కుమారస్వామి మాలధారణ దీక్షను ఇక్కడి ప్రజలు చేపడతారు. గ్రామంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద దీక్ష తీసుకున్న స్వాములు కఠోర దీక్షతో పూజలు చేస్తుంటారు. 500 మంది మహిళలు కలశాలతో బయలుదేరుతారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ద్వారపూడి పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విశేషపూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. స్వామిని టీడీపీ మండలాధ్యక్షుడు యరగతపు బాబ్జీ, బీజేపీ నేత కోనా సత్యనారాయణ, ప్రముఖులు దర్శించుకున్నారు.



మండపేట మండలం ద్వారపూడిలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ముగిసిన ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండ్యూరెన్స్ పోటీలు



హోరాహోరీగా జరుగుతున్న పోటీలు

గండేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండ్యూరెన్స్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. సీజన్-5లో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. వర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి హాజరయ్యారు. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల నుంచి మొత్తం 13 టీమ్‌లు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా రఘు ఇంజనీరింగ్ కాలేజీ (విశాఖ పట్నం), రన్నరప్‌గా ఎస్ఆర్‌కేఆర్‌కాలేజీ (భీమవరం) జట్లు గెలుపొందాయి. ముఖ్య అతిథిగా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ అడ్వాన్స్ ఇంజనీరింగ్ గ్రూప్ డాక్టర్ గంగారెడ్డి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ విజేతలను డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌కి రూ.75వేలు, రన్నర్‌కి రూ.50 వేలు, ఎండ్యూరెన్స్ విన్నర్‌కి రూ.50వేలు, రన్నర్‌కి రూ.25వేలు నగదు బహుమతిని అందించారు. వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జీ.సురేష్, ఎస్.భీమేశ్వరరెడ్డి, కే.నాగసురేష్, అడ్డూరి సీతారామ్మూర్తి పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

రాజమహేంద్రవరం/ధవళేశ్వరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ధవళేశ్వరం సీఐ టి.గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన దాడి గణేశ్ 2019లో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఆమెను చెక్క పీటతో కొట్టి, చాకుతో పొడిచి చంపేశాడు. దీనిపై మృతురాలి అన్నయ్య ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ వెంకయ్య, సీఐ బాలశౌరి కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో గణేశ్‌కు జీవిత ఖైదు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా జడ్జి డి.విజయ్ గౌతం తీర్పు చెప్పారు.

భార్యపెట్టిన కేసులతో మనస్తాపం చెంది

భర్త ఆత్మహత్య

ఉండ్రాజవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భార్య భర్తపై పెట్టిన కేసులతో భర్త మనస్తాపం చెంది పురుగుమందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో జరిగింది. ఉండ్రాజవరం ఎస్ఐ జి. శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాలు ప్రకారం.. పాలంగికి చెందిన ఉండ్రాజవరపు కిరణ్‌కుమార్ (47) విజయవాడకు చెందిన మంజుతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత ఉద్యోగం నిమిత్తం కిరణ్‌కుమార్ సింగపూర్ వెళ్లాడు. ఇండియాకు వచ్చినపుడు భార్యభర్తల మధ్య జరిగిన గొడవలు నేపథ్యంలో భార్య మంజు భర్త కిరణ్‌కుమార్‌పై 3 కేసులు పెట్టడంతో ఏడాదిక్రితం ఉద్యోగం మానేసి కోర్టులు చుట్టు తిరుగుతున్నారు. భార్య పెట్టిన కేసులకు మనస్తాపం చెంది మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మృతుడి తండ్రి ఉండ్రాజవరపు సౌలురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

భారీ దోపిడీకి స్కెచ్.. పోలీసుల చెక్!



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న పిస్టల్స్, బుల్లెట్లు

- కాకినాడ జిల్లాలో తప్పిన భారీ దోపిడీ
- పోలీసుల చాకచక్యంతో నిందితుడి పట్టివేత
- 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం
- నిందితుడు అంతర్‌జిల్లా పాత నేరస్తుడు
- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

సర్పవరం జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అతడో బ్యాంకు ఉద్యోగి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర చెడు వ్యసనాల కారణంగా పని చేసే బ్యాంకులో బంగారు ఆభరణాలు చోరీ చేసి నిందితుడిగా మారాడు. అప్పులు తీర్చేందుకు వేరేదారి లేక కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటను ఎంచుకున్నాడు. చిన్న చిన్న చోరీలు చేస్తే ప్రయోజనం లేదని ఏదైనా బ్యాంకు, ఏటీఎంలో చోరీకి పాల్పడి పెద్ద మొత్తంలో దోపిడీ చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే దురుద్దేశంతో బీహార్ నుంచి 2 పిస్టల్స్ కొనుగోలు చేశాడు. చోరీకి రెక్కీలు నిర్వహిస్తోండగా మంగళవారం రాత్రి కాజులూరులో రెక్కీ నిర్వహిస్తోండగా కాకినాడ జిల్లా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి చాకచక్యంగా నిందితుడ్ని పట్టుకున్నారు. 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్ వివరాలను బుధవారం సర్పవరం జంక్షన్‌లో గల కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

విశాఖపట్టణం మద్దిలపాలెం ఫిష్‌మార్కెట్ సమీపంలో గ్రూప్‌హౌస్‌లో చిటికెల నాగేశ్వరరావు, భార్య కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు గతంలో పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ప్రొబిషనరీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్, చెడు వ్యవసనాల కారణంగా బ్యాంకు నుంచి 900 గ్రాముల బంగారాన్ని బ్యాంకు నుంచి తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి సొంత అవసరాలకు వాడుకోవడంతో సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.40 లక్షలు బ్యాంకుకి కట్టేశాడు. అప్పులు తీర్చలేక, చెడు వ్యసనాలకు డబ్బుల్లేక చోరీల బాట పట్టాడు. చిన్న చోరీలతో జీవితంలో స్థిరపడటం సాధ్యం కాదని గ్రహించిన నాగేశ్వరరావు భారీ దోపిడీకి స్కెచ్ వేశాడు. బీహార్ ముంగర్ ప్రాంతానికి వెళ్లి 2పిస్టల్స్ 17 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. దాంతో బ్యాంకు, ఏటీఎంల దోపిడీ చేసేందుకు విశాఖ సిటీ, రూరల్, నర్సీపట్నం, ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లలో రెక్కీ నిర్వహించాడు. ఈ క్రమంలో నేరస్తుడు కాజులూరులో రెక్కీ నిర్వహిస్తున్నాడన్న పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కాకినాడ జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడ్ని పట్టుకుని, అతడి వద్ద నుంచి 2 పిస్టల్స్ 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నిందితుడు అరెస్ట్‌తో భారీ దోపిడీని పోలీసులు నియంత్రించడం జరిగిందన్నారు. నిందితుడిపై నర్సీపట్నంలో 3 కేసులు, అన్నవరం, నక్కపల్లి, తాడేపల్లిగూడెం, ఏలేశ్వరం పీఎస్‌లో తలో ఓ కేసు వెరసి మొత్తంగా ఒక చైన్ స్నాచింగ్, 4 రాత్రి, పగలు చోరీలు, ఓ బైక్ చోరీ కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన కాకినాడ రూరల్ సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్ఐలు ఎంవీవీ రవీంద్రబాబు,ఎం.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పిల్లి రాజు!

యానాం జీఎంసీ బాలయోగి వారధిపై ద్విచక్రవాహనం గుర్తింపు

ద్రాక్షారామ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గణపతినగరం వద్ద కన్నబిడ్డలను కాలువలోకి తోసి కుమార్తె కారుణ్య(7)మరణానికి కారకుడైన పిల్లి రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈనెల 17న రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి పిల్లిరాజు తన కుమారుడు రామసందీప్, కుమార్తె కారుణ్యలను పాఠశాల నుంచి తీసుకువచ్చి గణపతి నగరం వద్ద ఇంజరం కాలువలోకి తోసేశాడు. అనంతరం మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. ఘటనలో కుమారుడు రామసందీప్ ప్రాణాలతో బయటపడగా కుమార్తె కారుణ్య (7) మృతిచెందింది. అప్పటి నుంచి రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సిబ్బంది బృందాలుగా పిల్లి రాజు ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. మంగళవారం పిల్లి రాజు ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు తెలియచేయాలని రాజు ఫోటో కూడా పోలీసులు విడుదల చేశారు. బుధవారం రాజు మోటారు సైకిల్‌ను యానాం జీఎంసీ బాలయోగి వారధిపై గుర్తించారు. దీంతో రాజు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే కోణంలో సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐ ఎం.లక్ష్మణ్ పవర్‌బోట్లపై యానాం నుంచి సముద్ర తీర ప్రాంతం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. రాజు పోలీసులకు లొంగిపోయాడా లేదా అరెస్టు చేశారా అన్నది గురువారం తెలియనుంది. పిల్లి రాజు సజీవంగా పోలీసులకు చిక్కడంతో ఈ ఘాతుకం వెనుక పూర్వాపరాలు పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

గంజాయి కేసులో మైనర్ సహా ఐదుగురి అరెస్ట్

నిడదవోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి నిడదవోలులో గంజాయితో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను సీఐ తిలక్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ 18న మంగళవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ కాలనీ సమీపంలో కొందరు గంజాయి కలిగి ఉన్నారనే సమాచారంతో పట్టణ పోలీసులు దాడి చేసి ఐదుగురు యువకులు, ఒక మైనర్ బాలుడిని అరెస్ట్ చేశామన్నారు. పట్టణంలోని కుమ్మరవీధికి చెందిన దాసరి పృథ్వీ వెంకట సాయి నితీష్, జగనన్న కాలనీకి చెందిన గడిచుకోట భానప్రకాష్, చర్చిపేటకు చెందిన అక్కాబత్తుల బాలు, శింగవరం గ్రామానికి చెందిన మద్దాల భానుప్రకాష్, తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన పడాల భాగ్య శివ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ కాలనీ చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడుని అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ సుమారు రూ.55,225 ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో పట్టణ ఎస్ఐ జీఎస్ఆర్‌కె పరమహంస, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో గోల్డ్ చైన్ చోరీ

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు మహిళ మెడలో ఆరున్నర కాసుల బంగారు చైన్ దొంగిలించుకుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగింది. కొవ్వూరు 23వ వార్డు, చిట్టూరివారి వీధికి చెందిన కుందుల పద్మకుమారి పట్టణంలోని ఏసీఆర్ లాడ్జి సమీపంలోని పాలింపాటి నరసయ్యనగర్‌లో బుధవారం సాయంత్రం వాకింగ్ చేస్తుంది. వెనుక నుంచి వచ్చిన వ్యక్తి మెడలో ఉన్న ఆరున్నరకాసుల బంగారు చైన్ తెంపుకుని బైక్‌పై దొమ్మేరు రోడ్‌లోకి వెళ్లిపోయాడని బాధితురాలు తెలియజేసింది. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించి సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2వేల క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదలవుతోంది. సీలేరు నుంచి విడుదలవుతున్న నీటితో కలిపి గోదావరిలో నీటి లభ్యత 10,551 క్యూసెక్కులుగా ఉంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదయ్యింది.

మతిస్థిమితం లేని యువతికి వైద్యం

మానవత్వం చూపిన న్యాయమూర్తి



వివరాలు వెల్లడిస్తున్న జడ్జి కమలాదేవి

కాకినాడ క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకుండా ఒంటిపై సగం దుస్తులు మాత్రమే కప్పుకుని తిరుగుతున్న ఓ యువతి గురించి తెలుసుకున్న ఓ జడ్జి మానవీయ కోణంలో స్పందించారు. ఆమె ఆదేశానుసారం ఆ యువతికి కాకినాడ జీజీహెచ్‌లో వైద్యం అందిస్తున్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, మూడవ అదనపు జిల్లా కోర్టు జడ్జి పి.కమలాదేవి బుధవారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2రోజుల క్రితం తాను బయటకు వస్తుండగా మతిస్థిమితం లేకుండా ఒంటిపై సగం దుస్తులు మాత్రమే కప్పుకుని అక్కడక్కడా తిరుగుతున్న యువతిని చూశానని, ఆమె ఆచూకీ గమనించాలని తమ సిబ్బందితో పాటు పోలీసులకు తెలియజేశారన్నారు. బాధితురాలు సుమారు 10రోజులుగా నగరంలో ఈ విధంగా తిరుగుతోందని పోలీసులు తెలియజేయడంతో ఆశ్చర్యానికి గురయ్యానన్నారు. ఆమెకు మానసిక వైద్యం అందించాలని వైద్యులకు దిశ వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది తెలియజేయడంతో తాను ప్రత్యేకంగా రిసెప్షన్ ఆర్డర్ ఇచ్చానన్నారు. దీంతో బాధితురాలికి జీజీహెచ్‌లో వైద్యులు వైద్యం అందిస్తున్నారన్నారు. నగరానికి చెందిన ఆ యువతి వైద్య విద్యను అభ్యసించినట్టుగా విచారణలో తేలిందన్నారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం ఆమెను ఇంటికి పంపిస్తామన్నారు. ఈ విధంగా మతిస్థిమితం లేక దుస్తులు లేకుండా తిరిగే యువతులు ఎంతో మంది ఉన్నారన్నారు. వారి పట్ల ఎంతో దయగా వ్యవహరించాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఉపయోగించుకుని అండగా నిలవాలని జడ్జి కమలాదేవి హితవు పలికారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ వీరంగం

రోడ్డుపక్క నిల్చున్న మహిళను, ఆగి ఉన్న ఆటోను లారీతో ఢీ

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు



మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్‌ను కిందకు లాగి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు



వేళంగి పీహెచ్‌సీలో క్షతగాత్రురాలు బేబి

కరప, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఒక లారీ డ్రైవర్ వీరంగం సృష్టించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న లారీ వేళంగి వచ్చేసరికి అదుపు తప్పింది. స్థానిక నిత్యానందపురం సెంటర్ మలుపు తిరిగాక రోడ్డు పక్కన నిల్చున్న ఒక మహిళను, ఆగి ఉన్న ఆటోను, బజ్జీల బండిని లారీ డ్రైవర్ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. స్థానికులు వెంటపడి పట్టుకోగా డ్రైవర్ ఫూటుగా మద్యం తాగి మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. దీంతో చిర్రెత్తుకొచ్చిన పలువురు స్థానికులు డ్రైవర్‌ను కిందకు లాగి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. లారీ డ్రైవర్‌ను రామచంద్రపురానికి చెందిన రామకృష్ణ రాజుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన బండి బేబి గాయపడగా, ఆటో, బజ్జీల బండి ధ్వంసమయ్యాయి. క్షతగాత్రురాలికి వేళంగి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుని సన్నిధిలో సీఐఎస్ఎఫ్ బృందం పూజలు

అన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్)సైకిల్ ర్యాలీ సభ్యులు సత్యదేవుని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పశ్చిమ రాజగోపురం వద్ద నుంచి ర్యాలీని ఈవో సుబ్బారావు జెండా ఊపి పునఃప్రారంబించారు. ఈ బృందం 25 రాష్ట్రాల్లో 358 యూనిట్లతో 2లక్షల మంది దేశం నలుమూలలా అంతర్గత పరిరక్షణలో పాత్ర పోషించడం అభినందనీయమని ఈవో పేర్కొన్నారు.



సత్యదేవుని దర్శనానంతరం సీఐఎస్ఎఫ్ బృంద సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఈవో

కేరళ వెళ్దామని.. స్కూల్ నుంచి పరార్

నాలుగు గంటలు శ్రమకోర్చి ఆచూకీ తెలుసుకున్న పోలీసులు

రాజమహేంద్రవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు కేరళ చూడాలనుకోవడం పోలీసులకు ముచ్చెమటలు పట్టించింది. రామకృష్ణానగర్‌కి చెందిన 12ఏళ్ల సూర్య, 10ఏళ్ల మనోజ్ శంభూనగర్‌లోని ఓ పాఠశాలలో చదువుతున్నారు. రోజూ ఓ ఆటోలో ఇంటికి వెళ్తారు. ఒంటిపూట బడులు కావడంతో బుధవారం మధ్యాహ్నం వాళ్లు రాకపోవడంతో ఆటో డ్రైవర్ ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. వాళ్లు స్కూల్‌కి సమాచారం ఇవ్వగా.. స్కూల్ నుంచి పోలీస్ హెల్ప్‌లైన్‌కి ఫోన్ వెళ్లింది. దీంతో బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథం ఆధ్వర్యంలో పోలీసులు తక్షణమే వెతుకులాట ప్రారంభించారు. ఏలూరు జీఆర్పీ పోలీసులకు ఫోన్ చేసి ఆ సమయంలో వెళ్లే రైళ్లలో గమనించాలని చెప్పారు. ఈలోపు ఈ ఇద్దరు పిల్లలు ట్రాక్ వెంబడి నడుచుకుంటూ కడియం వైపు వెళ్తూ ఓ చోట కూర్చోడం పోలీసులు గమనించారు. ఆ ఇద్దరి లో ఒకరు ఇంటి నుంచి రూ.2500 కేరళ వెళ్ల డానికి తీసుకొచ్చారు. ట్రాక్ వెంబడి నడుస్తూ తినుబండారాలు కొనుక్కొంటూ ఉన్నారు. దీంతో సాయంత్రం వరకూ రైలు ఎక్కలేదు. పోలీసులకు ఆచూకీ దొరకడంతో కథ సుఖాంతమైంది. పిల్లల అనుపానువులు తల్లిదండ్రులు గమనించుకుంటూ ఉండాలని, ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో 4గంటలు శ్రమకోర్చి వాళ్ల ఆచూకీ తెలుసుకున్నామని సీఐ కాశీ విశ్వనాథం తెలిపారు. వాళ్లను క్షేమంగా పట్టుకోవడంతో తాము ఊపిరి పీల్చుకున్నామన్నారు. ఈ సందర్భంగా బొమ్మూరు పోలీసులను ఎస్పీ అభినందించారు.

27న బిక్కవోలు ఎంపీపీ ఎన్నిక

బిక్కవోలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న బిక్కవోలు మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. గత ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి గత యేడాది జూలై 3న రాజీనామా చేయడంతో ఈ పోస్టు ఖాళీగా వుందన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈనెల 23 లోగా ఎంపీటీసీ సభ్యులందరికీ ఎంపీపీ ఎన్నికపై ప్రత్యేక సమావేశ నోటీసులు అందిస్తామని, 27న నామినేషన్లు తీసుకుని ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎటువంటి కారణాల వల్లయినా ఎన్నిక వాయిదా పడితే 28న ఎన్నిక జరుపుతామన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఇందులో భాగంగా వెనుకబడిన వర్గాల నుంచి ఉపాధి పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందన్నారు. బీసీ, ఈబీసీ, కమ్మ, కాపు, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, తెలగ, ఒంటరి వర్గాలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయనుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల యూనిట్లు, పరిశ్రమలు, చిన్నతరహా వ్యాపారం, సేవలు, రవాణా విభాగాలకు సబ్సిడీ రుణాలు మంజురు చేస్తారని, ఆయా వర్గాల వారు ఈనెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆదిరెడ్డి పేర్కొన్నారు.

రంగస్థల నటుడు మురపాక వీర్రాజుకు నివాళి



వీర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి19(ఆంధ్రజ్యోతి): అఖిల గాండ్ల, తెలికుల సంఘీయుల అభివృద్ధి మురపాక వీర్రాజు చేసిన కృషి చిరస్మరణీయమని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ నరవ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక మల్లయ్యపేటలో బుధవారం ఉదయం నిర్వహించిన ప్రముఖ రంగస్థల నటుడు దివంగత మురపాక వీర్రాజు సంస్మరణ సభకు గోపాలకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రముఖ సినీ, టీవీ కళాకారిణి ఉమామహేశ్వరి మాట్లాడుతూ రథచక్రాలు, కళ్లప్రాణం ఖరీదు, మనీ ప్లస్ షీ వంటి నాటకాలలో వీర్రాజు విభిన్న పాత్రలు పోషించారన్నారు. తొలుత పలువురు నాటక కళాకారులు, తెలికుల సంఘ ప్రతినిధులు వీర్రాజు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నరవ అనంతం, ముద్దుర్తి నాగేశ్వరరావు, పోలిపల్లి శ్రీనివాస్, అడ్డా వెంకట్రాజు, వసాది సత్యనారాయణ, దూది రాము పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు

దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో ఖాళీగా ఉన్న 1 అంగన్‌వాడీ కార్యకర్త, 7 సహాయకులు (ఆయాలు) ఉద్యోగాలను భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీవో జె.జెస్సీఫ్లోరెన్స్ బుధవారం తెలిపారు. బిక్కవోలు మండలం కాపవరంలో అంగన్‌వాడీ కార్యకర్త, బలభద్రపురం, రంగాపురం, రంగంపేట మండలంలో ఎస్టీరాజాపురం, పెదరాయవరం, సుభద్రంపేట, చంద్రేడు, వడిశలేరు గ్రామాల్లో సహాయకుల ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారు స్థానిక వివాహిత మహిళలు అయి ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణులై 21నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు రంగంపేట ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సీడీపీవో పేర్కొన్నారు.

ఆరుగురు గైర్హాజరు

రెండో రోజు పది పరీక్షలు ప్రశాంతం

రాజానగరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రెండో రోజు బుధవారం నాటి హిందీ పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన 7 పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు సంబంధించి 1184 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజరయ్యారు. సంపత్‌నగరం పరీక్షా కేంద్రంలో నలుగురు, కానవరంలో ఒకరు, దివాన్‌చెరువు సూర్య గ్లోబల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఒకరు గైర్హాజరయ్యారన్నారు. రాజానగరం హైస్కూల్ పరీక్షా కేంద్రంలో వీల్‌చైర్ లేక దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారంటూ ఈ నెల 17న ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి బుధవారం వీల్ చైర్ సదుపాయం కల్పించారు.

రంగంపేటలో ఒకరు..

రంగంపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిశలేరు, రంగంపేట, సింగంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాల్లో జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 568 మంది విద్యార్థులకు గాను 567 మంది హాజరైనట్టు ఎంఈవో పి.మధుసూధనరావు తెలిపారు. రంగంపేటలో 203 మందికి 203 మంది, వడిశలేరులో 183 మందికి 183 మంది, సింగంపల్లి హైస్కూల్లో 183 మందికి 182 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు.

గోకవరంలో ఆరుగురు గైర్హాజరు

గోకవరం, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో బి.గౌరమ్మ తెలిపారు. మొత్తం 743మంది విద్యార్థులకు గాను 737 మంది హాజరైనట్టు పేర్కొన్నారు.

బిక్కవోలులో 8మంది గైర్హాజరు..

బిక్కవోలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో రెండో రోజైన హిందీ పరీక్షకు 8 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. బిక్కవోలు సెంటర్‌లో ఒకరు, బలభద్రపురంలో ఇద్దరు, పందలపాకలో ఐదుగురు హాజరు కాలేదన్నారు.

వర్గీకరణతో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

» రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మీపతిరావు
» రాజానగరంలో నిరసన ర్యాలీ

రాజానగరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఏపీ క్యాబినెట్ నిర్ణయానికి వ్యతిరేకంగా అఖిల భారత మాలల సంఘాల జేఏసీ పిలుపు మేరకు రాజానగరం మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. దీనిలో భాగంగా సూర్యారావుపేట వరకు నిరసన, ప్రదర్శన ర్యాలీ చేట్టి దళితవాడలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పు, సూచనలు పాటించకుండా, సమగ్ర వివరాలు సేకరించకుండా వెనుకబాటుతనాన్ని నిర్ధారించకుండా రాజ్యాంగ హక్కులను కాలరాసే దిశగా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నక్కా వెంకటరత్నం, బీఎస్పీ నాయకులు ఇసుకపట్ల రాంబాబు, ముప్పిడి శ్రీను, తుమ్మల తాతారావు, కొల్లాటి అబ్బులు, ప్రత్తి నాగేశ్వరరావు, కొల్లాటి చినవెంకన్న, సూర్యారావు, బొర్రా కాశీ తదితరులు పాల్గొన్నారు.

వెలుగుబంద పాఠశాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్

రాజానగరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగుబందలోని ప్రాథమికోన్నత పాఠశాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వై.ఆగ్నేశ్వరరావు మాట్లాడుతూ ఇంటిగ్రే టెడ్ స్కూల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, హెచ్‌డీబీఎఫ్ఎస్-వాషి-2024-2025లో భాగంగా దీనిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.



కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ముక్కపాటి దేవి వాష్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'తో విద్యుత్‌బిల్లుల ఆదా

ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్‌వర్మ



దివాన్‌చెరువులో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

దివాన్‌చెరువు, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఇంటి పైకప్పుపై సౌరఫలకాలను ఏర్పాటుచేసుకోవడం ద్వారా విద్యుత్‌బిల్లులను తగ్గించుకునేందుకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ అన్నారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎస్ఈ తిలక్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శ్రీధర్‌వర్మ మాట్లాడుతూ ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు వరకూ రాయితీ ఇస్తారన్నారు. మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునని చెప్పారు. కాగా రైతులు పంట పొలాల్లో సౌరప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు అమలు చేస్తున్న పీఎం కుసుమ్ పథకం కింద రాజానగరం మండలం కలవచర్లలో 2 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటుకు టెండర్లు పిలిచామన్నారు. గృహవినియోగదారులు 50శాతం రాయితీతో తమ విద్యుత్ అదనపు లోడ్ ను క్రమబద్దీకరించుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఈఈ(టెక్నికల్) ఎం.రవికుమార్, డీఈఈ పి.సన్యాసిరావు, ఏఈఈ వీఎస్ సుధాకర్,దివాన్‌చెరువు శ్రీలక్ష్మీగణపతి ఆటోయూనియన్ అధ్యక్షుడు దేశాల శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త సూరారపు డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

థెరిస్సా పార్కు ఆక్రమణలను తొలగించాలి

» కంబాలచెరువు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కార్యాచరణ
» మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్



మదర్ థెరిస్సా పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కంబాలచెరువు సెంటర్ సమీపంలోని మదర్ థెరిస్సా పార్కు చుట్టు పక్కల ఆక్రమణలు తొలగించాలని మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన పార్కును తనిఖీ చేసి మాట్లాడారు. కంబాలచెరువు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తామన్నారు. ఈ ప్రణాళికలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచే చర్యలు, వాహనాల పార్కింగ్ సౌకర్యాల పెంపు తదితరాలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఆక్రమణలు తొలగించడం ద్వారా మదర్ థెరిస్సా పార్కును సుందరంగా తీర్చిదిద్ది కంబాలచెరువు జంక్షన్‌కు తలమానికంగా అభివృద్ధి చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రత్యేకాభివృద్ధి నిధి నుంచి రూ.75 లక్షలు, రుడా నిధులు రూ.50 లక్షలతో పార్క్ అభివృద్ధి పనులు చేస్తున్నామని ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలినవి ఈ నెలలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామన్నారు. పనులు నాణ్యతతో పూర్తిచేయాలని కమిషనర్ ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సీటీ ప్లానర్ జి.కోటయ్య, ఈఈ మదర్‌షా ఆలీ, డీఈఈ ప్రసాద్, ఏఈ పి.ప్రసాద్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణుడికి విశేషపూజలు



నిడదవోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లిలో వేంచేసియున్న లక్ష్మీనారాయణస్వామికి బుధవారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం నుంచి విష్ణుసహస్రనామ పారాయణం, గోవింద నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు సేకరించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

'నన్నయ'లో వైద్య శిబిరం

దివాన్‌చెరువు, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉందని, పరీక్షలు సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఆమె సందర్శించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రాంగణంలోని కళాశాలల విద్యార్థులతోబాటు అధ్యాపకులు, సిబ్బంది ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించున్నారు. వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్యులు సేవలందించారు. కార్యక్రమమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, ఎన్ఎస్ఎస్ పీవో పి.వెంకటేశ్వరరావు, యూనిట్-2 పీవో ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.

1500 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



కోరుకొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుపట్నం గ్రామ శివారులో బుధవారం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా 1500 కిలోల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. 50కిలోల బరువున్న 30 బస్తాల బియ్యాన్ని బొలెరో వ్యాన్‌లో తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యాన్ని, వ్యాన్‌ను సీజ్ చేశారు. కాపవరం గ్రామానికి చెందిన తలారి వీరబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్యామ్ సుందర్ తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

కోరుకొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి గేటు వద్ద టీడీపీ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి లబ్ధిదారులకు అందజేశారు. మధురపూడికి చెందిన తిరుమలనాథుని వీరమణికి రూ.1,14,507, ముగ్గళ్ల గ్రామానికి వేముల దుర్గాదేవికి రూ.37,378, పురుషోత్తంపట్నంకు చెందిన అయినంపూడి వెంకటకృష్ణ సత్యనారాయణకు రూ.1.62 లక్షలు, పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన పత్తికట్ల లోవరాజుకు రూ.60 వేలు, నందరాడకు చెందిన బోళ్ల వెంకటరామారావుకు రూ.58,351 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగకేశవరావు, అడపా వీరబాబు, మాదబోయిన అప్పారావు, పెద్ది మాధవరావు, మళ్ళ అప్పల నర్సారావు, బుద్దా బాపూజీ, గోనగూడెం సర్పంచ్ రొంగల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

'సత్యసాయి' సిబ్బందికి 2 నెలల జీతాల మంజూరు

ఎమ్మెల్యే బత్తుల చొరవ
డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలు

కోరుకొండ/సీతానగరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలో సత్యసాయి మంచినీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవతో 2నెలలు జీతాలు మంజూరు చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారని ఎమ్మెల్యే బత్తుల కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే బలరామకృష్ణ. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి రాజానగరం నియోజకవర్గం కోరుకొండ, సీతానగరం, జగ్గంపేట నియోజకవర్గం గోకవరం, రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం పరిధిలోని గ్రామాల్లో పని చేస్తున్న సత్యసాయి మంచినీటి సరఫరా ఉద్యోగుల జీతాల సమస్యలను వారి కుటుంబాల్లో పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో అత్యవసరంగా 2నెలల జీతాలను విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అలాగే మిగిలిన సమస్యలన్నీ వారం రోజుల్లో పరిష్కారం చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారని ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు.

చాయిస్ ఫౌండేషన్ డాక్టరుకు సత్కారం



డాక్టర్ సతీష్‌ను సత్కరిస్తున్న ఎస్పీ కిషోర్

రాజమహేంద్రవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బందికి ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించిన చాయిస్ ఫౌండేషన్ డాక్టర్ సతీష్ గంటాను ఎస్పీ నరసింహ కిషోర్ సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు 7రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 12ఏళ్లలో అక్కడి పిల్లల్లో 3% మందికి సరిగా వినబడకపోవడం, 24/ మందికి సరిగా కనబడకపోవడం, 6% మందిలో బీపీ ఉన్నట్టు గుర్తించామన్నారు. ఏపీలోని పాఠశాలల్లో ఇదే కార్యక్రమం చేయడానికి సంకల్పించామన్నారు. అంగన్వాడీల్లోని పిల్లలకు కూడా ఇదే తరహా వైద్య పరీక్షలు చేయా లని కలెక్టర్ ప్రశాంతి సూచించారన్నారు. తమ ది తూర్పుగోదావరి జిల్లా సీతానగరం కావ డంతో ఈ జిల్లా నుంచే మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. పిల్లల్లో గుర్తించిన లోపాలకు చికిత్స చేయాల్సి వస్తే ప్రభుత్వ సహాయాన్ని తీసుకుంటామని చెప్పారు.

ఆంధ్రా వీల్‌చైర్ క్రికెట్ టీమ్ ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్, మారి 19(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలో సూరత్ లాల్భాయ్ కాంట్రాక్టర్ స్టేడియంలో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఆంధ్రా జట్టును ఎంపిక చేశారు. దీనికి సంబంధించి వివరాలను ఆంధ్రప్రదేశ్ వీల్ చైర్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు ఎ.మల్లేశ్వరరావు తెలిపారు. గుజరాత్‌లో జరిగే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఒడిస్సా, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల వీల్‌చైర్ క్రికెట్ క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఆంధ్ర వీల్‌చైర్ క్రికెట్ టీమ్‌లో ఎం.ప్రవీణ్‌కుమార్, కె.తాతాజీ, సీహెచ్ నాగరాజు, బి.ప్రేమ్‌సాగర్‌కుమార్,కె.నరేష్, బి.రామానాయుడు, ఎస్.శ్రీరాం, ఎల్.నాగూర్ మీరా సాహెబ్, ఎస్.సతీష్, ఎం.సతీష్, కె.ఈశ్వరరావు, డి.జ్యోతికుమార్, బి.దుర్గారావు, ముకిరి సురేంద్ర బాబు, బి.సతీష్‌లను ఎంపికచేశారని తెలిపారు.

విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

విశ్వబ్రాహ్మణ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాడుగు శ్రీను

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఎదురుచూస్తున్నవిశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి తగి న ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాడుగు శ్రీను ప్రభుత్వానికి బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణులు చేతివృత్తుల ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ప్రస్తుతం ఆధునిక యుగంలో మిషన్ల ప్రవేశించాక విశ్వబ్రాహ్మణులకు చేతి పనులు లేకుండా పోయాయని చెప్పారు. విశ్వబ్రాహ్మణులను అభివృద్ధి చేయాలంటే తమ వర్గం నుంచిఒక ఎమ్మెల్సీ ఒక చైర్మన్ వుంటే ప్రభుత్వంలో తమ హక్కులను తాము సాధించుకునే అవకాశం ఉంటుందని శ్రీను పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

నల్లజర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా తీవ్ర మనస్తాపం చెంది ఓ వ్యక్తి జీడితోటలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన తెలికిచర్లలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి .. గ్రామానికి చెందిన బుడిగిన శ్రీనివాసరావు వ్యవసాయం చేసుకుం టూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్య మహాలక్ష్మితో విబేధాలు తలెత్తడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది తన జీడితోటలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శోభనాద్రి కేసు నమోదు చేశారు.

పోస్ట్‌మార్టం అసిస్టెంట్ తొలగింపు

» ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందిపై వేటు
» మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు డబ్బులు డిమాండ్
» మార్చురీ సిబ్బందిపై చర్యలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ విధానంలో మార్చురీలో పనిచేస్తున్న పోస్టుమార్టం అసిస్టెంట్‌తోపాటు ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందిని తొలగించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయడానికి మృతుల బంధువుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై జరిపిన విచారణలో నిర్ధారణ కావడంతో వారిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. వైద్య ఉద్యోగులు సేవాభావంతో విధులు సక్రమంగా నిర్వర్తించాలని, ఇటువంటి ఘటనల విషయంలో ఉపేక్షించేదిలేదని కలెక్టర్ పేర్కొన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు అనంతరం ఆరోపణలు నిర్ధారణ కావడంతో మార్చురీ పోస్టుమార్టం అసిస్టెంట్, ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందిని తొలగించడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ మూర్తి పేర్కొన్నారు.

రొటేషన్ విధానంలో ముగ్గురి నియామకం

రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చే రోగులకు సేవలందించే ఎంఎన్‌ఓలకు సంబంధించిన విధులను పర్యవేక్షించడానికి మూడు నెలలకు ఒకరు చొప్పున ముగ్గురు ఉద్యోగులను సూపర్‌వైజర్లుగా రొటేషన్ పద్ధతిలో నియమిస్తూ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎంఎన్‌వోపై సహచర ఉద్యోగుల నుంచి తీవ్ర ఆరోపణలు రావడంతో ఆసుపత్రి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకూ జి.వెంకటకృష్ణ, జూలై నుంచి సెప్టెంబరు వరకూ ఆర్‌వీకే భీమేశ్వరరావు, అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ ఎం.దుర్గా కుమార్‌లను పర్యవేక్షకులుగా నియమించారు. తాను జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా తక్షణమే ఆయా ఎంఎన్‌ఓలకు విధులు కేటాయించాలని ఆసుపత్రి ఆర్ఎంవోకు సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు.

'ఆర్ట్స్'ను సందర్శించిన విద్యానిపుణుల బృందం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నియమించిన విద్యానిపుణుల బృందం బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను సందర్శించింది. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ కె.విజయబాబు, అకడమిక్ ఆఫీసర్లు టి.జాన్‌కిరణ్, ఈ.వరప్రసాద్‌లతో కూడిన ఈ బృందం మూడురోజులపాటు 2023-24, 2024-25 విద్యాసంవత్సరాలకు సంబంధించి అకడమిక్ ఆడిట్ నిర్వహిస్తుంది. ఆయా సంవత్సరాల్లో కళాశాల జరిపిన విద్యాపరిశోధన, విస్తరణ, సామాజిక, ఇతర కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తారు. మరికొద్ది రోజుల్లోనే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల న్యాక్ ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లవలసిన నేపథ్యంలో ఈ అకడమిక్ ఆడిట్‌కు ప్రాధాన్యత ఉన్నదని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు.

ట్రాఫిక్‌ను నియంత్రించండి

ధవళేశ్వరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం ప్రధాన రహదారిపై వాహనాలు రద్దీ వల్ల తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ కూటమి నాయకులు బుధవారం సీఐ గణేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సాయిబాబు గుడి నుంచి బ్యారేజ్ సెంటర్ వరకు వాహనాల వేగాన్ని 20కిలోమీటర్లుగా నియంత్రిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుతో పాటు సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పందూరి అప్పారావు, యడ్ల మహేష్, ఒంటెద్దు స్వామి, షేక్ షాజిద్, దారపు శివారెడ్డి, సీకోటి శివాజీ, సులోమాన్ పాల్గొన్నారు

బిక్కవోలు లక్ష్మీగణపతి నిత్యాన్నదానానికి విరాళం

బిక్కవోలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని లక్ష్మీగణపతి ఆలయంలో భక్తులకు నిర్వహించే నిత్యాన్నదానానికి వేమగిరికి చెందిన విత్తనాల దుర్గేశ్వరరావు దేవి దంపతులు రూ. 30వేలు విరాళాన్ని బుధవారం అందించారు. వీరికి ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ స్వామి దర్శనం కల్పించి వేద ఆశీర్వచనం చేయించారు.

వైసీపీ బలోపేతానికి కృషి

గోకవరం, మార్చి19(ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతం చేసే క్రమంలో భాగంగా పలు గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు ఆ పార్టీ సీనియర్ నాయకుడు జ్యోతుల రామస్వామి అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం, తంటికొండ, గాదెలపాలెం, ఇటికాయిలపల్లి, గోపాలపురం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి కార్యకర్తలతో సమావేశమై యోగక్షేమాలు తెలుసుకున్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:19 (గురువారం సాయంత్రం)
సహర్: 4:46 (శుక్రవారం ఉదయం)

గంజాయి కేసులో మైనర్ సహా ఐదుగురి అరెస్ట్

11 కిలోలు స్వాధీనం

నిడదవోలులో ఘటన

గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా : సీఐ

8



అంతరిక్షం.. అద్భుతం!

భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమిపై అడుగిడిన వేళ అమలాపురం రూరల్‌లోని సమనస లోని శ్రీరామా పబ్లిక్ స్కూలు విద్యార్థులు 'వెల్‌కం సునీత' అనే అక్షరాల రూపంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపిన దృశ్యం.
- అమలాపురం రూరల్



కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు అంజి ఆకొండి వాటర్ కలర్స్‌తో గీసిన సునీతా విలియమ్స్ చిత్రం.
- కాట్రేనికోన

ఆలివ్ రిడ్లే.. గుడ్లు.. గుడ్లే..






- సముద్ర తీరంలో విదేశాల నుంచి అలివర్ రిడ్లే తాబేళ్ల ప్రవాహం
- ఇప్పటివరకు కాకినాడ, కోనసీమ జిల్లాలకు 675 తాబేళ్లు రాక
- జనవరి 18 నుంచి ఈ రెండు జిల్లాల్లో 74 వేల గుడ్లు పెట్టిన తాబేళ్లు
- కాకినాడ హోప్‌ఐలాండ్‌లో 27 వేల గుడ్లు పెట్టిన 225 తాబేళ్లు
- కోనసీమ జిల్లాలో 46 వేల గుడ్లు పొదిగిన 450 అలీవ్‌రిడ్లేలు
- ఒక్కో తాబేలు 120 చొప్పున గుడ్లు పొదుగుతున్నవైనం
- సముద్ర తీరాన గొయ్యి తీసి గుడ్లు పొదిగి ఇసుక కప్పేసి తిరిగి సముద్రంలోకి
- మొదలైన గుడ్ల నుంచి తాబేలు పిల్లల జననం.. రోజుకు 650 పిల్లలు బయటకు
- నక్కలు, కుక్కల బారి నుంచి రక్షించేందుకు అటవీ శాఖ హేచరీలు
- గతేడాది ఉమ్మడి జిల్లాలో 1.20 లక్షల గుడ్లు పొదిగిన అలీవ్‌రిడ్లే తాబేళ్లు



గుంతలు తవ్వి గుడ్లు పొదిగిన తాబేళ్లు





గుడ్లను సంరక్షిస్తోన్న అటవీశాఖ సిబ్బంది

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

అంతరించిపోయే జాబితాలో చేరిన అరుదైన అలీవ్‌రిడ్లే తాబేళ్లు మన సముద్ర తీర ప్రాంతానికి ఓ ప్రవాహంలా తరలివస్తున్నాయి. ఎక్కడెక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీలంక.. థాయ్‌లాండ్.. ఇండోనేషియా దేశాల నుంచి సముద్రంలో వేల కిలోమీటర్లు ఈదుకుంటూ ఇక్కడకు సంతానోత్పత్తి కోసం బారులు తీరుతున్నాయి.. ఇప్పుడు కాకినాడ జిల్లాలోని హోప్ ఐలాండ్.. కోనసీమ జిల్లాలోని గోదావరి, సముద్రం కలిసే ప్రాంతాల్లో వేలల్లో గుడ్లు పెడుతున్నాయి. సంతానోత్పత్తికోసం అంతదూరం నుంచి వస్తోన్న ఈ తాబేళ్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఇప్పటివరకు పెట్టిన గుడ్లు ఎన్నో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే.. ఒక్కో తాబేలు సరాసరి 120 గుడ్ల చొప్పున జనవరి మూడో వారం నుంచి ఇప్పటివరకు ఏకంగా 74 వేల గుడ్లు పొదిగాయి. గుడ్లు పొదిగేసి ఆ వెంటనే తిరిగి సముద్రంలోకి వెళ్లిపోగా.. ఇప్పుడు ఆ గుడ్ల నుంచి రిడ్లే పిల్లలు బయటకు రావడం మొదలుపెట్టాయి. ఎక్కడో వేల కిలోమీటర్లు ఈదుకుని ఇక్కడ కొచ్చి గుడ్లు పొదిగి పిల్లలను చూడకుండానే వెళ్లిపోతున్న తాబేళ్లు ఆ గుడ్లను రక్షించేందుకు ఏకంగా గోతులు తవ్వి అందులో గుడ్లు పొదిగి ఎవరికి కనిపించకుండా ఇసుక కప్పేసి వెళ్లిపోగా.. ఇప్పుడు వాటి నుంచి రోజుకు వందలాది పిల్లలు బయటకు వస్తున్నాయి. దీంతో ఇప్పుడు సముద్రతీరంలో ఇవన్నీ సందడి చేస్తూ కనువిందు చేస్తున్నాయి. అటు అటవీ శాఖ అధికారులు ఈ గుడ్ల నుంచి క్షేమంగా పిల్లలు బయటకు వచ్చేలా అనేక రక్షణ చర్యలు తీసుకుంటుండడంతో ఈ ఏడాది ఆలివ్‌రెడ్లే తాబేళ్ల సంతానం భారీస్థాయిలో పెరుగుతోంది.

సందడే సందడి..

సముద్ర పర్యావరణాన్ని రక్షించడంలో ఎంతో కీలకమైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోయే జాబితాలో ఉన్నాయి. ఈ తాబేళ్లలో ఏడు రకాల జాతులుండగా, ఐదు జాతులు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో అధికం. అటు శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేషియా దేశాల్లోను అనేక జాతులున్నాయి. ఇప్పుడివి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సముద్ర తీరానికి వందల్లో ప్రయాణించుకుంటూ వస్తున్నాయి. ప్రధానంగా కాకినాడ హోప్‌ఐలాండ్, కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, అల్లవరం, అమలాపురం రూరల్ ప్రాంతాల్లోని సముద్ర తీరానికి తరలివస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా వీటి సందడే నెలకొంది. వీటి రాక జనవరి నెలాఖరు నుంచి మొదలవగా ప్రస్తుతం ఎక్కువ సంఖ్యకు చేరుకుంది. ఇలా వచ్చిన తాబేళ్లన్నీ కాకినాడ, కోనసీమ జిల్లాల్లో భారీగా గుడ్లు పొదుగుతున్నాయి. ఇప్పటివరకు అటవీశాఖ అధికారుల అంచనా మేరకు కాకినాడ జిల్లాకు 225, కోనసీమ జిల్లాకు 450 తాబేళ్లు వచ్చినట్టు గుర్తించారు. ఇవి ఇప్పటివరకు మొత్తం 74 వేల గుడ్లు పొదిగాయి. ఇది భారీ సంఖ్యగానే భావించాలి. కాకినాడ జిల్లాలో హోప్‌ఐలాండ్‌కు ఇప్పటివరకు 225 తాబేళ్లు రాగా, 28వేల గుడ్లు పొదిగాయి. కోనసీమ జిల్లాలో 450 తాబేళ్లు 46వేల గుడ్లు పొదిగినట్టు గుర్తించారు. దీంతో ఈ రెండు జిల్లాల తీర ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సందడి భారీగా ఉంది. వాస్తవానికి ఈ గుడ్లను తాబేళ్లు సముద్రతీరాన ఇసుకలో 30 నుంచి 45 సెంటీమీటర్ల లోతున కుండాకారంలో గుంతలు తీస్తాయి. వాటిలో గుడ్లను పొదుగుతాయి. ఒక్కో తాబేలు సరాసరి 120 వరకు గుడ్లను పొదుగు తాయి. ఆ వెంటనే గుడ్లపై ఇసుకను కప్పేసి తిరిగి తాబేళ్లు తమ గమ్యస్థానానికి వెళ్లిపోతాయి. ఆ తర్వాత 40 రోజుల ఆ తర్వాత ఆ గుడ్ల నుంచి తాబేళ్లు పొదుగుతాయి. ఈలోపు 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఎండ వేడిమి ఉంటేనే గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. ఇప్పుడు హోప్‌ఐలాండ్‌తోపాటు కోనసీమ జిల్లాలో వాసాలతిప్ప, ఎస్.యానాం, గచ్చకాయల పొర, నీళ్ల రేవు తదితర ప్రాంతాల్లో వేలల్లో ఉన్న గుడ్లను అటవీశాఖ సంరక్షిస్తోంది. తాబేళ్లు పెట్టే గుంతలను ఇన్సిటివ్‌గా పిలిచే అటవీశాఖ వాటి చుట్టూ ప్రస్తుతం నెట్‌లు కట్టి రక్షిస్తోంది. లేదంటే కుక్కలు, నక్కలు ఈ గుడ్లను తినేసే ప్రమాదం ఉంది. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న గుడ్లను అటవీశాఖ కాకినాడ జిల్లాలో రెండు, కోనసీమ జిల్లాలో ఐదుచోట్ల హేచరీల కింద ఒకేచోటకు తెచ్చి సంరక్షించడంతో దీంతో ఈ దఫా గుడ్ల సంరక్షణ మెరుగైంది.

పిల్లలు బయటకొస్తున్నాయి..

ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో కాకినాడ, కోనసీమ జిల్లాలకు 675 వరకు రాగా, 90 శాతం తాబేళ్లు గుడ్లు పెట్టి వెళ్లిపోయాయి. ఇప్పుడు 40 రోజుల వ్యవధి దాటడంతో ఆదివారం నుంచి పిల్లలు పొదుగుతున్నాయి. రోజుకు ఉమ్మడి జిల్లాలో 780 వరకు పిల్లలు బయటకొస్తున్నాయి. ఇవి పుట్టిన 12గంటల్లో తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతున్నాయి. వాస్తవానికి అరుదైన జాతికి చెందిన ఆలివ్‌రిడ్లే తాబేళ్లలో ఆడా, మగా పుట్టుక పూర్తిగా ఉష్ణోగ్రతపైనే ఆధారపడనున్నాయి. గుడ్లు పొదిగిన తర్వాత 28 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే 40 రోజుల తర్వాత మగ తాబేళ్లు, ఉష్ణోగ్రత 30 నుంచి 32 మధ్య ఉంటే ఆడ తాబేళ్లు బయటకు వస్తాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఆడతాబేళ్ల పిల్లలు అధికంగా బయటకు వస్తున్నాయి. కాకినాడతో పోల్చితే కోనసీమ జిల్లాలో పిల్లలు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఈనెలాఖరు వరకు రానున్న తాబేళ్లు మరికొన్ని గుడ్లను పొదగనున్నాయి. ఈనెల దాటితే విదేశాల నుంచి అలివ్ రిడ్లే తాబేళ్ల రాక పూర్తిగా ఆగిపోనుంది.

ఇక్కడకే ఎందుకంటే..

ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ఓ ప్రత్యేకత ఉంది. అవి ఎక్కడైతే గుడ్ల నుంచి పిల్లలుగా బయటకు వచ్చాయో అదే ప్రాంతానికి పెద్దయ్యాక తిరిగి సంతానోత్పత్తికి వస్తాయి. ఇందులోభాగంగా కాకినాడ జిల్లాలో హోప్ ఐలాండ్, కోనసీమ జిల్లాలో కొన్ని తీరప్రాంత మండలాలకు తరలివస్తున్నాయి. గతంలో ఉప్పాడ తీరానికి సైతం భారీగా వచ్చేవి. అక్కడ సముద్రతీరం కలుషితం కావడంతో ఇక్కడకు రావడం లేదు. వాస్తవానికి ఏటా వేలల్లో వచ్చే ఆలివ్‌రిడ్లే తాబేళ్లు కొన్నేళ్లుగా భారీగా తగ్గిపోయాయి. సముద్ర కాలుష్యం, వేట పడవులకు తగిలి, వలలో చిక్కుకుని భారీగా చనిపోతున్నాయి. దీంతో రెండేళ్లుగా సముద్రతీరంలో ఎక్కడ చూసినా వీటి కళేబరాలే కనిపిస్తున్నాయి. దీంతో అరుదైన జాతికి చెందిన వీటిని సంరక్షించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జిల్లా అటవీశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో తాబేళ్ల గుడ్లను ఇటీవల ఎక్కువగా సంరక్షిస్తున్నారు. సముద్రంలో ఆక్సిజన్ శాతం పెంచేందుకు, చేపల సంతానం వృద్ధి చెందేందుకు ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఎంతగానో దోహదం చేస్తాయి. చేప పిల్లలను తిని జీవించే జెల్లీఫిష్‌లను తాబేళ్లు తినడంవల్ల చేపల ఉత్పత్తి పెరుగుతుంది. కాగా గతేడాది ఉమ్మడి జిల్లాలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు లక్షకుపైగానే గుడ్లు పొదిగాయి. కాకినాడ జిల్లాకు గతేడాది 420 తాబేళ్లు రాగా 32 వేల వరకు గుడ్లు పొదిగాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గతేడాది 850 వరకు తాబేళ్లు రాగా 91 వేల గుడ్లు పొదిగాయి.

12 పంచాయతీలకు ఉపసర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని 10 మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న ఉపసర్పంచ్‌ల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడిందని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతామణి తెలిపారు. దీనిలో భాగంగా గోకవరం మండలం పరిధిలో మల్లవరం, కొవ్వూరు మండలంలో పినకలమెట్ట, రాజానగరం మండలంలో పాతతుంగపాడు, గోపాలపురం మండలం పరిధిలో కొవ్వూరుపాడు, గోపాలపురం, వెంకటాయిపాలెం, తాళ్లపూడి మండలం తాడిపూడి, అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం, రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ, సీతానగరం మండలం మునికూడలి, ఉండ్రాజవరం మండలం ఉండ్రాజవరంతో కలసి మొత్తం 12 గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఈనెల 27న ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు ఆమె తెలియజేశారు.

ఎంపీపీ, ఎంపీపీ ఉపాధ్యక్ష ఖాళీల భర్తీకి 27న ఎన్నికలు

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానాలకు, ఎంపీపీ ఉపాధ్యక్ష పదవులకు, కోఆప్షన్ మెంబర్ల ఉపఎన్నికలకు షెడ్యూలు విడుదల చేశారు. కాకినాడ రూరల్, బిక్కవోలు, కాట్రేనికోన మండలాల ఎంపీపీ పదవులకు ఎన్నిక జరుగనుంది. అలాగే సఖినేటిపల్లిలో రెండు వైస్ ఎంపీపీలకు ఎన్నిక జరుగుతుంది. పెరవలి, రంగంపేట మండల పరిషత్‌లలో కోఆప్షన్ మెంబరు పదవులకు ఎన్నిక జరుగుతుంది. ఈనెల 27వ తేదీన ఈ ఎన్నికలకు సంబంధించి ఉదయం పది గంటలలోగా నామినేషన్లు స్వీకరణ జరుగుతుంది. ఉదయం 10 గంటల తర్వాత నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 12 గంటలకు ఆమోదించబడిన అభ్యర్థుల నామినేషన్ల వివరాలు ఇవ్వడం జరుగుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపు నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుంది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఆయా పదవులకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ సాగుతుంది. వెంటనే ఎన్నికైన అభ్యర్థుల వివరాలు వెల్లడించడం జరుగుతుంది.

బాకీ వసూల్!

- పేరుకుపోయిన చలానాలు
- ట్రాఫిక్, రవాణా కలిపి రూ.13 కోట్ల పెండింగ్
- వాటిని రాబట్టడంపై ప్రత్యేక డ్రైవ్‌లు
- పట్టుబట్టి మరీ అక్కడికక్కడే వసూలు



ఆటోలు తనిఖీలు చేస్తున్న మహిళా పోలీసులు



దేవీచౌక్‌లో వాహనాల తనిఖీలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రహదారి నిబంధనల ఉల్లంఘనలపై విధించిన జరిమానాలు భారీగా పేరుకుపోయాయి. ట్రాఫిక్ పోలీసులు, రవాణా అధికారులు వాటి వసూళ్లపై తీవ్రంగా దృష్టిసారించారు. మరోవైపు పాత బాకీలకు కొత్త ఉల్లంఘనలు తోడవుతూనే ఉన్నాయి. ఈనెల 1 నుంచి సవరించిన జరిమానాలు అమల్లోకి రావాల్సి ఉంది. అయితే సాంకేతిక కారణాల వల్ల సమస్య రావడంతో ఇంకా కొత్త చలానాలు విధించడం లేదు. పెండింగ్ చలానాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోనే ఎక్కువగా చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడే ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో చలానాల పెండింగ్ కూడా అదే స్థాయిలో ఉంది. హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, రెడ్ సిగ్నల్ పడినా ఆగకపోవడం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం, మితిమీరిన వేగం వంటి ఉల్లంఘనలపై విధించిన చలానాలు ఆయా వాహనాదులు చెల్లించకపోవడంతో పెద్ద మొత్తంలో పెండింగ్ చూపెడుతోంది. గతంలో మితిమీరిన వేగంతో వెళ్లినా, హెల్మెట్ లేకపోయినా తదితర ఉల్లంఘనలకు అక్కడికక్కడే జరిమానా విధించడం జరిగేది. అయితే తర్వాత కెమెరాలను రంగంలోకి దింపారు. ఏదైనా రహదారి భద్రతా నియమాలను పాటించకపోతే వెంటనే ఫొటో తీసి వెబ్‌సైటులో అప్‌లోడ్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వాహనదారులు పరివాహన్ వెబ్‌సైటులో చెక్ చేసుకొని చలానా చెల్లించేసి ఆ కాపీ ప్రింట్ తీసి లేదా స్క్రీన్‌షాట్ తీసి దగ్గర పెట్టుకుంటే ఇబ్బంది ఉండదు. అయితే వాహనానికి చలానా విధించారనే విషయం వాహనదారుడికి తెలియడం లేదు. కనీసం సెల్‌ఫోన్‌కి మెసేజ్ వెళ్లే సిస్టం కూడా లేదు. దీంతో చలానాల పెండింగ్ ఎక్కువవుతోంది. సాధారణంగా ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు మూడు నెలలకు ఒకసారి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి వాటికి పెద్దగా పెండింగ్ ఉండదు. రవాణేతర అంటే ద్విచక్ర వాహనాలు, సొంత నెంబరు ప్లేటు కలిగిన కార్లు వంటి వాటిపై ఎక్కువగా చలానాలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలపై భారీగా బాకీలు ఉన్నాయి. సాధారణంగా వాహనదారులు https://echallan.parivahan.gov.in వెబ్‌సైటులోకి వెళ్లి సదరు వాహనంపై ఏదైనా చలానా పెండింగ్ ఉందా లేదా అనేది చెక్ చేసుకోవచ్చు. చలానా పెండింగ్‌లో ఉంటే తెలుస్తుంది. ఆ సొమ్మును ఆన్‌లైన్ ద్వారా అదే వెబ్‌సైటు నుంచి చెల్లించవచ్చు. మీసేవలో కట్టవచ్చు. పెండింగ్ చలానాలను రాబట్టడానికి ఇప్పుడు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో వాహనంపై చలానా పెండింగ్ ఉన్నట్టు తనిఖీ అధికారులు గుర్తిస్తే వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. లేదంటే వాహనం సీజ్ చేసే అధికారం అధికారులకు ఉంటుంది.

● **జిల్లాలో రూ.13 కోట్లపైనే**

జిల్లాలో జరిమానాలు భారీగా పెండింగ్ ఉన్నాయి. కోర్టు జరిమానా విధిస్తే వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. పెండింగ్ చలానాలకు ఏరోజుకారోజు జరిపే తనిఖీల్లో విధంచే చలానాలు జత చేరుతున్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం ట్రాఫిక్ పోలీసులకు సంబంధించి గత ఏడాదివి రూ.3 కోట్ల విలువ చేసే 75 వేల చలానాలు, 2025లో ఇప్పటివరకూ రూ.80 లక్షలు విలువచేసే 20 వేల చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. రవాణా శాఖకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5కోట్లు జరిమానాలు వసూలు కాగా.. ఇంకా 5 వేల కేసులకు రూ.10 కోట్లు వసూలు కావాల్సి ఉంది.



మహిళా శక్తి టీమ్‌లకు పచ్చజెండా ఊపుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

మహిళా శక్తి యాప్ ప్రతి మహిళ సెల్‌ఫోన్‌లో ఉండాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నూతనంగా అధునాతన సాంకేతికతతో ప్రభుత్వం తీసుకొచ్చిన 'మహిళా శక్తి' యాప్ బాలికలు, మహిళల పట్ల రక్షణ కవచం వంటిదని.. అందువల్ల ఆ యాప్ వారి సెల్‌ఫోన్స్‌లో కచ్చితంగా ఉండాల్సిందేనని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఏడు శక్తి బృందాల వాహనాలకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పచ్చజెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. అంతకుముందు ఎస్పీ మాట్లాడుతూ దిశ యాప్‌లో రిజిస్ట్రేషను చేసుకున్న వాళ్లు కూడా ఇప్పుడు మరిన్ని సదుపాయాలతో వచ్చిన మహిళా శక్తి యాప్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషను చేసుకోవాలన్నారు. ఈ యాప్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. 24/7 మహిళల భద్రతే ధ్యేయంగా మహిళా శక్తి టీమ్స్ పని చేస్తాయన్నారు. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలలు, పార్కులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్లలో మఫ్టీలో శక్తి టీమ్ సభ్యులు గమనిస్తూ ఉంటారన్నారు. మహిళలు, బాలికలు ఆపదలో ఉన్న సమయంలో సాధ్యమైనంత తక్కువ సమయంలో వారి వద్దకు చేరుకుంటారని వివరించారు. మహిళలను సురక్షితంగా చూసుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. రాత్రి 10.30గంటల తర్వాత బాలికలు తారసపడితే వారిని సున్నితంగా ప్రశ్నించి ఇబ్బందికర పరిస్థితి అనుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు/వేధింపులపై ఎలాంటి సమాచారం ఉన్నా తమతో పంచుకోవాలని కోరారు. ఇప్పటికే రెండు మండలాల్లో మహిళలు/బాలికల పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశామని, మరిన్ని ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే గంజాయి వంటి నిషేధిక మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా నేరుగా తనకు తెలియజేయవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మత్తు కలిగించే ఔషధాలను డాక్టరు ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించడం నేరమని, వాటి అమ్మకాలపై నిఘా పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ(అడ్మిన్), ఏవీ సుబ్బరాజు(శాంతి భద్రతలు), ఎల్.అర్జున్(క్రైమ్స్), ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న వికాస ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో జీఎస్ఎల్ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్, హాస్టల్ మేనేజరు, ల్యాబ్ టెక్నీషియన్, ఎంసీవీ మాటో కార్ప్‌లో జీఎం, మేనేజరు, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, మహిళలకు ప్రత్యేకంగా ఫాక్స్‌కాన్, హైదరాబాదులో ఆపరేటర్, ఇండో ఎంఐఎం, పానా సోనిక్, హ్యూండాయ్ కంపెనీలలో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, నర్సింగ్, బీటెక్ ఉత్తీర్ణులై ఉండి 30 ఏళ్ల లోపు వయస్సు గలవారై ఉండాలన్నారు. అర్హతను బట్టి 10 వేల నుంచి 40వేల వరకు జీతం, అలవెన్సులు ఆయా ఉద్యోగాలకు అనుగుణంగా ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉదయం 9.30 గంటలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, జిరాక్సు కాపీలతో నేరుగా హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 7660823903 నంబరుకు ఫోన్ ద్వారా సంప్రదించాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ముప్పిడి చొరవ

• పది విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పన



తాళ్లపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అన్నదేవరపేట, గజ్జరం గ్రామాల నుంచి పదో తరగతి పరీక్షలు రాయడానికి తాళ్లపూడి, వేగేశ్వరపురం వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు నడిచే విధంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చొరవ తీసుకున్నారు. ఈ మేరకు కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో సంప్రదించారు. వెంటనే ఆయన స్పందిస్తూ అన్నదేవరపేట నుంచి తాళ్లపూడి, వేగేశ్వరపురానికి బస్ సౌకర్యం కల్పించారు. ఈ విషయం తెలిసిన కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, కొన్ని సంవత్సరాలుగా గజ్జరం, అన్నదేవరపేట ప్రజలకు ఆర్టీసీ బస్ సౌకర్యం లేక నానా అవస్థలు పడుతుండేవారు. కేవలం ఆటోలపైనే ఆధారపడ్డ పరిస్థితి ఉండేది. ఇకనైనా కొవ్వూరు - తాళ్లపూడి - గోపాలపురం రూట్లో ఈ సర్వీసును కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ



పంపిణీ చేస్తున్న స్వర్ణాంధ్ర సేవా సమితి సభ్యులు

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు సమాజ సేవకులని స్వర్ణాంధ్ర సేవా సమితి ముఖ్య నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. బుధవారం కొవ్వూరు ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద రోడ్డు మార్జిన్లలో వ్యాపారాలు చేస్తున్న వారికి ఎండ తగలకుండా కొవ్వూరు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వి. సతీష్, కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరం లాలాచెరువులో ఉన్న స్వర్ణాంధ్ర సేవా సమితి ఆధ్వర్యంలో గత 27 సంవత్సరాలుగా ఎండ, వానల నుంచి రక్షణ కల్పించే విధంగా ప్రతి వేసవిలో ఉభయ గోదావరి జిల్లాల్లోని వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్నామన్నారు. కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వి.సతీష్, పి. రాంబాబు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

వీసీ ప్రసన్నశ్రీని కలిసిన 'దుర్గాంబ' ప్రభుత్వ డిగ్రీ కళాశాల బృందం



వీసీని మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం

నిడదవోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ హామీ ఇచ్చినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరంలోని నన్నయ వర్సిటీలో వీసీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య, నైపుణ్య శిక్షణ, అకడమిక్ నాణ్యతను పెంచేదిశగా ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నా మన్నారు. జిల్లాలో తమ కళాశాల మాత్రమే నాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించి ఉందన్నారు. ఈమెతోపాటు అధ్యాపక బృందం లావణ్య, కె.సుమలత, పి.ఉషారాణి, ఎ.శ్రీలక్ష్మి, భ్రమరాంబ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కొవ్వూరు 'మున్సిపల్' ఆశీలు వేలం పాట

● రూ. 28,05,000 కు దక్కించుకున్న అనంతలక్ష్మి

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పురపాలక సంఘ పరిధిలోని రోడ్డు మార్జిన్, బాపూజీ కూరగాయల మార్కెట్, వారాంతపు సంతలో ఆశీలు వసూళ్లకు బుధవారం వేలంపాట నిర్వహించారు. దీన్ని తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన ఇలపన అనంతలక్ష్మి రూ. 28,05,000కు దక్కించుకున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ ఆమె పేరును ప్రకటించారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2026 మార్చి 31 వరకు ఆశీలు వసూలుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు.

లక్ష్మీనారాయణుడికి విశేషపూజలు



నిడదవోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లిలో వేంచేసియున్న లక్ష్మీనారాయణస్వామికి బుధవారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం నుంచి విష్ణుసహస్రనామ పారాయణం, గోవింద నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

● గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కరరెడ్డి



పశివేదలలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కరరెడ్డి

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎస్సీ, బీసీల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75వేలు ఇస్తున్న అదనపు సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ జిల్లా ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. భాస్కర రెడ్డి అన్నారు. బుధవారం పశివేదలలో లబ్ధిదారులకు గృహనిర్మాణ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 21,584 ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల, గ్రామ గృహ నిర్మాణశాఖ సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 5804 మందికి సమాచారం అందించి, 5,758 మందిని నేరుగా కలవడం జరిగిందన్నారు. వారిలో 4,409 మంది ప్రభుత్వం అందిస్తున్న అదనపు సాయంతో ఇంటి నిర్మాణాన్ని చేపట్టేందుకు అంగీకరించారన్నారు. మే 2025 చివరి నాటికి జిల్లాలో ఆరువేల ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డిప్యూటీ ఈఈ శేఖర్‌బాబు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పీబీవీ రమణ



పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న దృశ్యం

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఎంపీడీవో కే. సుశీల సామర్లకోట ఈటీసీకి బదిలీపైవెళ్లారు. ఈనెల 18వ తేదీన రిలీవ్ అయ్యారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీవోగా తాళ్లపూడి ఎంపీడీవో పీబీవీ రమణకు బాధ్యతలు అప్పగించారు. దీనిలో భాగంగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్ కె. ప్రసన్నకుమార్, ఈవోఆర్‌డీ కె. ప్రకాశరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నూతన ఎంపీడీవోని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

పది పరీక్షా కేంద్రం తనిఖీ



నిడదవోలులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహశీల్దార్ నాగరాజు నాయక్

నిడదవోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణం, మండలంలో 10వ తరగతి పరీక్షల తీరును తహశీల్దార్ బీ.నాగరాజు నాయక్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, వైద్య సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉన్నాయా, లేవా అన్నదానిపై ఆరా తీశారు. హిందీ పరీక్షకు నిడదవోలు పట్టణం, మండలంలో తొమ్మిది పరీక్షా కేంద్రాలలో 1443 మంది హాజరు కావాల్సి ఉండగా, 1408 మంది మాత్రమే హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి గణేష్ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. వికాస ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. మరింత సమాచారానికి 7660823903 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

ఉండ్రాజవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరికీ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో మొత్తం 44 రేషన్ షాపుల్లో 6,412 మంది కార్డుదారులు ఉన్నట్టు తెలిపారు. వారందరూ ఈకేవైసీ చేయించేలా డీలర్లు సహకరించాలని కోరారు. అనంతరం ఈకేవైసీ చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ ఎస్. సుధీర్‌రెడ్డి, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు స్టేషన్ సెక్యూరిటీ కోడ్ నెంబర్లు కేటాయింపు



ఆటోలకు స్టిక్కర్లు అంటిస్తున్న పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రయాణికుల రక్షణ కోసం ఆటోలకు స్టేషన్ సెక్యూరిటీ కోడ్ నెంబర్లు కేటాయించినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆటోలకు బుధవారం స్టేషన్ సెక్యూరిటీ కోడ్ నంబర్ల స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు రహదారి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో కొవ్వూరు డీఎస్పీ జి. దేవకుమార్ సూచనల మేరకు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏడు ఆటో యూనియన్లలో ఉన్న సుమారు 100 ఆటోలకు స్టేషన్ సెక్యూరిటీ నెంబర్లు అతికించడం జరిగిందన్నారు. ఆటోడ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. ఆటో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'గోపాలపురంలో డయేరియా పూర్తిగా తగ్గుముఖం'



బాధితుల నుంచి వివరాలు అడుగుతున్న వైద్యాధికారులు

గోపాలపురం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): గోపాలపురంలో డయేరియా పూర్తిగా తగ్గుముఖం పట్టిందని సమగ్ర వ్యాధి నిఘా బృందం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం పరిశీలించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆసుపత్రికి వచ్చామన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకులు ఎన్నిరోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నా రంటూ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 31 మంది కేస్ షీట్‌లను విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్టు వెల్లడించారు. ఈమెవెంట డీసీహెచ్‌ఎస్ పద్మరాణి, సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్య, వైద్యులు హేమ కుమార్, హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యురాళ్లు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు. అలాగే గత నాలుగురోజులుగా డయేరియా బాధితులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో వైద్యం అందించినట్టు సామాజిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ చైతన్యరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గత నాలుగురోజులుగా ఆయా గ్రామాల నుంచి 31 కేసులు నమోదయ్యాయన్నారు. బుధవారం నాటికి దశల వారీగా 31 మంది కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి పంపటం జరిగిందన్నారు. వీరితోపాటు వైద్యాధికారులు, తదితరులు ఉన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

చాగల్లు, మార్చి 19, (ఆంధ్రజ్యోతి): ఊనగట్ల శివారు అమ్మిగుంటలోని రవళి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న జలకీ మజీ (19) అనే వివాహిత బుధవారం తాను ఉంటున్న గదిలో ఫ్యాన్‌కి ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు ఎస్ఐ కే.నరేంద్ర బుధవారం తెలిపారు. వివరాలివి.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జలకీ మజీకి జగన్నాథ మజీతో సంవత్సరం క్రితం వివాహమైంది. జీవనోపాధి కోసం ఇక్కడకి వచ్చి స్పిన్నర్స్ కంపెనీలో కూలి పనిచేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్నిరోజులుగా అనారోగ్యంగా ఉందని, స్వగ్రామానికి వెళ్లిపోదామని భర్తతో గొడవపడుతోంది. కానీ భర్త సరిగా స్పందించకపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త జగన్నాథ మజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



దేవరపల్లిలో మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న కూటమి నేతలు

దేవరపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కూటమి నాయకులు బుధవారం మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాధవరపు వెంకటేశ్వరరావు, పసుపులేటి శివనాగ ప్రసాద్, దాసరి శేషారావు, దుగ్గిన గంగాధర నాయుడు, సిద్ధా తాతబ్బాయి, సూరిశెట్టి బాలు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. హిందీ పరీక్షకు ఐదు సెంటర్లలో మొత్తం 1024 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 997 మంది హాజరైనట్టు ఎంఈవోలు ఎం.తిరుమలదాసు, అప్పారావు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

నల్లజర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా తీవ్ర మనస్థాపం చెంది ఓ వ్యక్తి జీడితోటలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన తెలికిచర్లలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి .. గ్రామానికి చెందిన బుడిగిన శ్రీనివాసరావు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్య మహాలక్ష్మితో విబేధాలు తలెత్తడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెంది తన జీడితోటలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శోభనాద్రి కేసు నమోదు చేశారు.

ప్రశాంతంగా పదోతరగతి హిందీ పరీక్ష

కొవ్వూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో పదోతరగతి హిందీ పరీక్షకు 21 మంది గైర్హాజరయ్యారు. పట్టణ, మండలంలోని 10 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1273 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 1252 మంది హాజరయ్యారు. కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్‌లో 75కి 69, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (గవర్నమెంటు హైస్కూల్) 134 కి132, ఏఎన్‌జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో 109కి 109, డా. సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 95కి 93, అభ్యాస పాఠశాలలో 130కి 130, వేములూరు దీప్తి హైస్కూల్లో 148 మందికి 143, భాష్యం పాఠశాలలో 144 కి 139, జడ్పీహెచ్ఎస్, కుమారదేవంలో 118కి 118, జడ్పీహెచ్ఎస్, వాడపల్లిలో 212కి 211, జడ్పీహెచ్ఎస్, పంగిడిలో 108 కి 108 మంది విద్యార్థులు హాజరయ్యారు. కొవ్వూరు అల్లూరి నాగరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలను ఆర్డీవో డా. రాణీసుస్మిత, గవర్నమెంట్ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్‌ను తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు.

చాగల్లు : స్థానిక జడ్పీ హైస్కూల్లో బుధవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ కేంద్రాన్ని డీఈఈవో రామన్న దొర తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మౌలికసదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. హిందీపరీక్షకు 200 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, ముగ్గురు హాజరయ్యారు. అలాగే ఊనగట్ల హైస్కూల్లో 101 మంది గాను 99 మంది, మార్కొండపాడు హైస్కూ ల్‌లో 73 మందికి 73 మంది హాజరయ్యారు. ఎంఈవో గురునాథం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కురుకూరులో భూ రీసర్వే పనులు ప్రారంభం



రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

దేవరపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేపట్టిన సర్వేలో జరిగిన అవకతవకలపై ప్రస్తుత ప్రభుత్వం రీసర్వే చేపట్టింది. కురుకూరులో 2500 ఎకరాల్లోని 1297 మంది రైతులకు 97శాతం తప్పులతడకలుగా జరిగాయి. ఈ విషయంపై రైతులు రెవెన్యూశాఖ మంత్రి, ఎమ్మెల్యే, ఆర్‌డీవోకు కూడా గతంలో పలుమార్లు విన్నవించారు. రీసర్వే పనులు చేపట్టాలని అసెంబ్లీలో కూడా మద్దిపాటి వెంకట్రాజు రెవెన్యూ మంత్రికి కూడా తెలియజేయడంతో ఈ విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. దీంతో బుధవారం కురుకూరులో భూరీసర్వే పనులను ఆర్‌డీవో రాణీసుస్మిత పరిశీలించి మాట్లాడుతూ ఈ రీసర్వేకు మూడుటీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరితగతిన ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐవోఎస్ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాస్, మండల సర్వేయర్ డిల్లేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి, రైతులు కొయ్యల మూడి అచ్యుతరాయుడు, యలమాటి భాస్కరరావు, మల్లెల వెంకటేశ్వరరావు, కలగర శ్రీనివాస్, బేతిన వెంకట్రావు, కొయ్యలమూడి శ్రీనివాస్, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మైనర్‌తో సహా ఐదుగురి అరెస్ట్



నిడదవోలులో మాట్లాడుతున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిలక్

నిడదవోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచామని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీవీజీ తిలక్ అన్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో సీఐ మాట్లాడుతూ 18వ తేదీ సాయంకాలం స్థానిక వైయస్సార్ కాలనీ సమీపంలో కొందరు అక్రమంగా గంజాయి కలిగివున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా, ఐదుగురు యువకులు, ఒక మైనర్‌ని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామన్నారు. ఇందులో పట్టణంలోని కుమ్మర వీధికి చెందిన దాసరి పృథ్వీ వెంకటసాయి నితీష్, జగనన్న కాలనీకి చెందిన గడిచుకోట భానుప్రకాష్, చర్చిపేటకు చెందిన అక్కాబత్తుల బాలు, శింగవరం గ్రామానికి చెందిన మద్దాల భాను ప్రకాష్, తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన పడాల భాగ్య శివసుబ్రహ్మణ్యం, వైయస్సార్ కాలనీకి చెందిన 17 ఏళ్ల మైనర్‌ని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. దాని విలువ సుమారు రూ. 55,225 ఉంటుం దన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దాడుల్లో పట్టణ ఎస్ఐ జీఎస్ఆర్‌కే పరమహంస, పలువురు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో శానిటేషన్ పనులు



గ్రామంలో పనులు చేస్తున్న దృశ్యం

గోపాలపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గోపాలపురంలోని 13, 14, 15, 16 వార్డుల్లో సూపర్ శానిటేషన్ పనులు బుధవారం ముమ్మరంగా జరిగాయి. రోజుకు నాలుగు వార్డులు చొప్పున 16 వార్డుల్లోనూ డ్రైనేజీ పూడికతీత, వీధుల్లో బ్లీచింగ్ చల్లించటం వంటి పనులను పంచాయతీ కార్యదర్శి అనురాధ దగ్గరుండి చేయిస్తున్నారు.

దేవరపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం



దేవరపల్లిలో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దేవరపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన శిబిరంలో రోగులకు డాక్టర్లు కే.నారాయణరావు, సురేష్, రమేష్ వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు కేసి రాజు సీతారామయ్య, పప్పు వెంకట్రామారావు, గద్దే కృష్ణారావు, బండి సూర్యప్రకాశరావు, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, షేక్ సయ్యద్, యలమాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భార్య పెట్టిన కేసులతో.. మనస్థాపం చెంది భర్త ఆత్మహత్య

● పోలీస్ కేసు నమోదు ● పాలంగిలో ఘటన

ఉండ్రాజవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భార్య భర్తపై పెట్టిన కేసులతో తీవ్ర మనస్థాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ భర్త. ఈ సంఘటన పాలంగిలో జరిగింది. ఎస్ఐ జి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ... పాలంగికి చెందిన ఉండ్రా జవరపు కిరణ్‌కుమార్ (47) విజయవాడకు చెందిన మంజుతో 16 ఏళ్ల క్రితం వివాహమయ్యింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో ఉద్యోగంలో భాగంగా కిరణ్‌కుమార్ సింగపూర్‌కు వెళ్లాడు.తిరిగి ఇండియాకు వచ్చినప్పుడల్లా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో భార్య మంజు కిరణ్‌కుమార్‌పై మూడు కేసులు పెట్టడంతో ఏడాదిక్రితం ఉద్యోగం మానేసి, కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు. భార్య పెట్టిన కేసులతో మనస్థాపం చెంది మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ఉండ్రాజవరపు సొలురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కే. రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

20 గ్రాముల బంగారం, బైక్ దొంగతనం

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అందరూ నిద్రిస్తుండగా ఇంటిలో ప్రవేశించి దొంగతనానికి పాల్పడిన సంఘటన ఆరికిరేవులలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఆరికిరేవుల గ్రామానికి చెందిన బీర చక్రవర్తి కుటుంబ సభ్యులు రోజు మాదిరిగా మంగళవారం రాత్రి ఇంటి తలుపులువేసి నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆరు గంటలకు నిద్రలేచి చూసేసరికి బీరువా సొరుగు ఇంటిపక్క సందులో పడి ఉంది. దీంతో ఇంటిలో వెతకగా 20 గ్రాముల విలువైన బంగారపు గొలుసు, నాలుగు జతల చెవిదిద్దులు, బైక్ అపహరణకు గురైనట్టు నిర్ధారించి పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె. జగన్మోహనరావు తెలిపారు.

మహిళ మెడలోని బంగారం చోరీ

● ఆరున్నర కాసుల చైన్‌ను అపహరించుకుపోయిన అగంతకుడు



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలు మహిళ మెడలోని ఆరున్నర కాసుల బంగారం చైన్‌ను ఓ గుర్తుతెలియని అగంతకుడు దొంగిలించుకుపోయాడు. ఈ సంఘటన కొవ్వూరు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని 23వ వార్డు చిట్టూరివారి వీధికి చెందిన కుందుల పద్మకుమారి ఏసీఆర్ లాడ్జి సమీపంలోని పాలింపాటి నరసయ్యనగర్‌లో బుధవారం సాయంత్రం వాకింగ్ చేస్తుంది. దీంతో వెనుక నుంచి వచ్చిన వ్యక్తి మెడలో ఉన్న ఆరున్నరకాసుల బంగారు చైన్ తెంపుకుని బైక్‌పై దొమ్మేరు రోడ్డులోకి వెళ్లిపోయాడని బాధితురాలు తెలిపింది. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్, సీఐ పీ. విశ్వం, ఎస్ఐ కే. జగన్మోహనరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.